

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 15.05.2026 | సంపుటి: 3 | సంచిక: 103 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 15.05.2026 | VOLUME : 3 | ISSUE : 103 | PAGES: 8 | COST: 2/- |




**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# కాంగ్రెస్‌లో కమలం గుబులు..




- రేవంత్‌తో మోదీ కెమిస్ట్రీపై తెలంగాణలో పొలిటికల్ హీట్
- ప్రధాని వ్యాఖ్యలతో హస్తం పార్టీలో కలకలం
- రేవంత్‌బీజేపీ బంధంపై బీఆర్ఎస్ ఫెవికాల్ సెటైర్లు
- సీఎం సేఫ్ జోన్ గేమ్ ఆడుతున్నాడా? అన్న రాజకీయ చర్చ
- అస్సాం, బెంగాల్ ఫార్ములానే తెలంగాణలోనూ అమలు చేస్తారా?
- ఒక్క వేదికపై నవ్వులు.. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అనుమానాలు

**హైదరాబాద్, మే 14(రాజముద్ర న్యూస్):** మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి హైదరాబాద్ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రదర్శించిన రాజకీయ శైలి తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెరలేపింది. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ వేదికపై సీఎం రేవంత్ రెడ్డితో మోదీ సరదా సంభాషణలు, నవ్వులు, పరస్పర అనుబంధం కేవలం ప్రోటోకాల్ పరిమితి కాదనే విశ్లేషణలు జోరందుకున్నాయి. ముఖ్యంగా "గుజరాత్‌కు మించిన అభివృద్ధి కావాలంటే మాతో చేతులు కలపాలి" అన్న మోదీ వ్యాఖ్య, దానికి రేవంత్ నవ్వుతూ స్పందించిన తీరు తెలంగాణ కాంగ్రెస్‌లో గుబులు రేపుతుండగా, బీజేపీ వ్యూహాలపై

మిగతా 2వ పేజీలో..





# సింగరేణిలో మహిళా శక్తి

## డంపర్ ఆపరేటర్లుగా నియామకానికి సన్నాహాలు

- హెచ్‌ఎంవీ శిక్షణను పూర్తి చేసిన 13మంది
- 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారి అవకాశం

**హైదరాబాద్, మే 14 (రాజముద్ర న్యూస్) :** మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తిని ప్రోత్సహించాలని ఆదేశించడంతో సంస్థ చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఓపెన్ కాస్ట్ (ఓసీ) గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్‌ను గని క్వారీ నుండి ఉపరితలానికి

మిగతా 2వ పేజీలో..




# మరోమారు తెరపైకి ఫార్ములా ఈ-రేస్ కేసు

- కేటీఆర్ తదితరులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు
- జూలై 31న విచారణకు రావాలని ఆదేశాలు

2



# విద్య ఎవరి సొత్తు కాదు

- తెలంగాణ రైజింగ్‌లో ప్రతీ విద్యార్థి భాగం కావాలి
- క్రీడలు, యువజన సంక్షేమ శాఖ మంత్రి వాకిటి

3

# యువత భవిష్యత్తుతో చెలగాటమా?



- నీట్ రద్దుపై రేవంత్ ఫైర్..
- మోడీ సర్కార్ నిర్ణయం నిరంకుశ చర్య అంటూ సీఎం ఆగ్రహం
- రెండు కోట్ల మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమైందన్న ఆరోపణ
- పరీక్షల వైఫల్యాలపై కేంద్ర మంత్రులపై చర్యలేదని విమర్శ
- తెలంగాణ విద్యార్థులకు అండగా ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం భరోసా

3

## కేరళ సీఎం అభ్యర్థి సతీశన్‌కు రేవంత్ అభినందనలు

03

- ఆయనకు పదవి దక్కడం సముచిత గుర్తింపు అని వెల్లడి

# ఇంధన పొదుపుపై తెలంగాణ సర్కార్ దృష్టి

- సీఎం, మంత్రుల కాన్వాయ్‌ల తగ్గింపుపై కసరత్తు

3



2

# ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- భగీరథకు మధ్యంతర బెయిల్‌పై నేడు హైకోర్టు నిర్ణయం



# ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

2

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



- **రబీలో 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా**
- 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధం
- దిగుబడి, కొనుగోలులో ఆల్ టైం రికార్డ్
- ధాన్యం కొనుగోలుకు రూ.22,000 కోట్ల కేటాయింపు
- రైతాంగాన్ని మోసం చేస్తే కఠిన చర్యలు
- అందుబాటులో ఉన్న వాహనాలన్నీ వినియోగించాలి
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3



# శిక్షణ, పాఠ్యాంశాల్లో ఆధునికత ఉండాలి

- గ్రేహౌండ్స్ ఆపరేషన్స్‌పై డీజీపీ ఆనంద్ సమీక్ష
- ప్రభుత్వ పరిశీలనలో పోస్టుల 708 సరెండర్ ప్రతిపాదన

2



# ఉగ్ర ముప్పుపై తెలంగాణ అప్రమత్తం.. ఆక్టోపస్ యాక్షన్ ప్లాన్..!

- ఇబ్రహీంపట్నం ఆక్టోపస్ ట్రైనింగ్ సెంటర్‌లో డీజీపీ పర్యటన
- స్వాట్ టీమ్స్ శిక్షణ, మాక్ డ్రిల్స్‌పై ప్రత్యేక సమీక్ష
- కమాండోలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- భవిష్యత్ ఎయిర్‌పోర్ట్ భద్రతపై వ్యూహాలు సిద్ధం

**హైదరాబాద్, మే 14 (రాజముద్ర న్యూస్):** తెలంగాణ రాష్ట్ర కౌంటర్ టెర్రర్ ఫోర్స్ 'అక్టోపస్' (OCTOPUS) పనితీరు, శిక్షణ కార్యకలాపాలు , ఆపరేషనల్ సన్నద్ధతను రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (DGP) శ్రీ సీవీ ఆనంద్ గురువారం క్షుణ్ణంగా సమీక్షించారు. ఇబ్రహీంపట్నంలోని అక్టోపస్

మిగతా 2వ పేజీలో..

# సుబోధ్ సింగ్ గ్యాంగ్ పనే..

- కరీంనగర్ జ్యువెలరీ దోపిడీ మిస్టరీ వీడింది!
- కరీంనగర్ జ్యువెలరీ దోపిడీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్
- ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్ బీహార్ జైలు నుంచే పథకం రచించినట్లు వెల్లడి
- మొత్తం 13 మంది నిందితులను గుర్తించిన పోలీసులు
- బెంగాల్, బీహార్‌లలో నిందితులను పట్టుకున్న ప్రత్యేక బృందాలు
- మిగిలిన వారి కోసం వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న గాలింపు

**కరీంనగర్, మే 14 (రాజముద్ర న్యూస్):** కరీంనగర్ పట్టణంలో సంచలనం రేపిన పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. కేసులో మొత్తం 13 మంది నిందితులను గుర్తించామని, పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు

మిగతా 3వ పేజీలో..






# పదవీ బాధ్యతలు స్వీకరించిన వీహెచ్

**హైదరాబాద్, మే 14 (రాజముద్ర న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(బీసీ సంక్షేమం)గా ఇటీవల నియమితులైన వి. హనుమంతరావు(వీహెచ్) డాక్టరు బి.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పలురు పార్టీ నేతలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాంగ్రెస్‌లో కమలం గుబులు..

**మొదటిపేజీ తరువాయి**

కొత్త అనుమానాలకు దారితీసింది.
తెలంగాణ రాజకీయాల్లో మాస్ ఇమేజ్ కలిగిన నేతగా రేవంత్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారు. బీఆర్ఎస్ వంటి బలమైన శక్తిని ఢీకొట్టి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు వచ్చిన ఆయనపై కమలం పార్టీ వ్యూహాత్మకంగా దృష్టి పెట్టిందా? అన్న ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. రాష్ట్రంలో బీజేపీకి బలమైన సామూహిక మద్దతు కలిగిన స్థానిక నాయకత్వం లోపిస్తున్న వేళ, ప్రత్యర్థి పార్టీల్లో ఉన్న ప్రజాదరణ గల నేతలపై సాఫ్ట్ కార్నర్ చూపించడం రాజకీయ పెట్టుబడిగా మారవచ్చన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.
బీజేపీ గతంలో అస్సాం, వెస్ట్ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో అనుసరించిన రాజకీయ సమీకరణాలను తెలంగాణలోనూ ప్రయోగించవచ్చన్న సందేహాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్‌లో అంతర్గత గ్రూపు రాజకీయాలు, వర్గ పోరు, నాయకత్వ పోటీలు ఎప్పటికప్పుడు చర్చకు వస్తున్న నేపథ్యంలో.. రేవంత్‌పై మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపడం వెనుక భవిష్యత్ రాజకీయ లెక్కలు ఉన్నాయా? అనే చర్చ సాగుతోంది. ఇక బీఆర్ఎస్ మాత్రం ఈ పరిణామాన్ని అవకాశంగా మలుచుకుంటూ కాంగ్రెస్ బీజేపీ మధ్య "ఫెవికాల్ బంధం" అంటూ సెటైర్లు విసురుతోంది. రేవంత్ బీజేపీతో సాన్నిహిత్యం పెంచుకుంటున్నారనే ప్రచారాన్ని బలపరచాలని చూస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్‌లోని వ్యతిరేక వర్గాలు కూడా ఈ పరిణామాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి రాజకీయ ఒత్తిడి పెంచే అవకాశాలపై చర్చ జరుగుతోంది.
రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి కాంగ్రెస్‌ను వీడే అవకాశాలు కనిపించకపోయినా, భవిష్యత్ రాజకీయ సమీకరణాల్లో తనకు ప్రత్యామ్నాయ మార్గాలు తెరిచి ఉంచుకునే సేఫ్ గేమ్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. సీఎం పదవిలో ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగినా, అంతర్గత విభేదాలు పెరిగితే రాజకీయ భవిష్యత్తు కోసం బీజేపీ ఒక ఆప్షన్‌గా మారుతుందా? అన్న సందేహాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.మొత్తానికి హైదరాబాద్ వేదికపై మోదీరేవంత్ నవ్వులు కేవలం మర్యాదపూర్వక సంభాషణలా? లేక తెలంగాణలో భవిష్యత్ రాజకీయాలకు సంకేతమా? అన్న ప్రశ్నకు సమాధానం రానున్న రోజుల్లో తేలనుంది. అయితే ఒక్క వేదికపై ప్రధాని ప్రదర్శించిన సాన్నిహిత్యం.. కమలానికి ఊపు, కాంగ్రెస్‌కు గుబులు, బీఆర్ఎస్‌కు విమర్శా ఆయుధం అందించిందనేది మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

# సింగరేణిలో మహిళా శక్తి డంపర్ ఆపరేటర్లుగా నియామకానికి సన్నాహాలు

**మొదటిపేజీ తరువాయి**



రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల సామర్థ్యం గల భారీ డంపర్లను వినియోగిస్తున్నది. సింగరేణిలో యాభయ్యేళ్లుగా నిర్వహిస్తున్న ఓసీల్లో ఇప్పటివరకు పురుష ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్‌లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతోపాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరం. పైగా మండే ఎండలు, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకుని మూడు షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుంది. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కలు సింగరేణిని ఆదేశించారు. ఈ క్రమంలో సింగరేణి సంస్థ ఓసీల్లో డంపర్ ఆపరేటర్లుగా పనిచేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులు కోరింది. మొదట దాదాపు 35 మంది ముందుకు వచ్చారు. భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే ఉన్న సాధారణ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (ట్రైడ్స్) అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాల డ్రైవింగ్ శిక్షణను అందించింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నోటిఫికేషన్‌లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో 13 దశాబ్దాల సింగరేణి సంస్థ చరిత్రలో తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించేందుకు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది.

**తాము కూడా చేయగలమన్న ఆత్మవిశ్వాసం కలిగింది**

ఈ సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం, నైపుణ్యంతో కూడుకున్న పని అని, తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇలాంటి పనులు చేయగమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతోపాటు రోదసిలోకి వెళ్తున్నారని, గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని, ఇలాంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. అధికారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ఆదేశాల మేరకు సింగరేణిలో మహిళా శక్తికి తగిన అవకాశాలు కల్పిస్తూ వస్తున్నామని, బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా మహిళలను నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారని, అలాగే ఇతర విభాగాల్లో కూడా వారు రాణిస్తున్నారని పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

## ఉగ్ర ముప్పుపై తెలంగాణ అప్రమత్తం..

# ఆక్టోపస్ యాక్షన్ ప్లాన్..!

**మొదటిపేజీ తరువాయి**

కమాండో శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, క్యాంపస్‌లోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, శిక్షణ విభాగం , ఆపరేషనల్ సౌకర్యాలతో పాటు కొత్తగా అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమాండోలు, అధికారులతో ముఖాముఖి మాట్లాడి, ఏవైనా అవాంఛనీయ ఉగ్రవాద సంఘటనలు ఎదురైతే వాటిని తిప్పికొట్టేందుకు ఫోర్స్ ఎంతవరకు సిద్ధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (SWAT) బృందాల పనితీరును , శిక్షణ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆపరేషన్స్ విభాగం డీజీ డాక్టర్ అనిల్ కుమార్ ఈ సందర్భంగా డీజీపీకి పలు అంశాలపై వివరణ ఇస్తూ, ఆపరేషనల్ టీమ్స్ నిర్వహిస్తున్న రెగ్యులర్ కార్యకలాపాలను వివరించారు. కీలక సంస్థలు, సున్నిత ప్రాంతాల్లో కాలానుగుణంగా చేపడుతున్న మాక్ ఎక్సర్‌సైజులు, ఉగ్రవాద వ్యతిరేక పోరాట విన్యాసాలు , అత్యాధునిక ఆయుధాల వినియోగంలో కమాండోలకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ గురించి ఆయన పేర్కొన్నారు. కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి వివిధ రకాల భవన సముదాయాలు, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే రీతిలో మాక్ ఆపరేషన్లు నిర్వహించడం అత్యంత కీలకమని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
కమాండోలు శారీరక దృఢత్వంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, ఎల్లప్పుడూ నిశితమైన అప్రమత్తతతో ఉంటూ 24 గంటలూ విధులకు సిద్ధంగా ఉండాలని డీజీపీ సూచించారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన అత్యాధునిక పరికరాల సేకరణ , మౌలిక సదుపాయాల బలోపేతంపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాలతో పాటు భవిష్యత్తులో రాబోయే విమానాశ్రయాల భద్రతను దృష్టిలో ఉంచుకుని కార్యకలాపాల వ్యూహాలను పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రేహౌండ్స్ , అక్టోపస్ దళాలు తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, వాటి వృత్తి నైపుణ్యం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన కొనియాడారు. ఈ దళాల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం , పోలీస్ శాఖ నుంచి పూర్తి స్థాయి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం. వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ సీహెచ్. రఘునందన్ , ఇతర అక్టోపస్ అధికారులు పాల్గొన్నారు.

# ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**హైదరాబాద్, మే 14:**



పోక్సో కేసులో నిందితుడైన బండి సాయి భగీరథ్ దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిన్‌పై విచారణను హైకోర్టు వెకేషన్ బెంచ్ వారం రోజులకు వాయిదా వేసింది. అతని తరపు న్యాయవాది కృష్ణకాంత్ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ముందస్తు, మధ్యంతర బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం మధ్యంతర బెయిల్‌పై నిర్ణయాన్ని శుక్రవారానికి వాయిదా వేయగా ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారం రోజులపాటు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక అంశాలను లేవనెత్తారు. కరీంనగర్‌లో బాధితురాలిపై తప్పుడు కేసు నమోదు చేశారని కోర్టుకు తెలిపారు. బాధితురాలి తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో కరీంనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేశారని వివరించారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో ఈ కేసులో సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని పీపీ వాదించారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడని పదేపదే చెప్పాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. భగీరథ్ తరఫున అడ్వకేట్ కృష్ణకాంత్ తన వాదనలు వినిపిస్తూ ఈ కేసులో భగీరథ్‌పై 'పోక్సో' చట్టం వర్తించదని, ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించామని తెలిపారు. యువతి మైనర్ అనే నెపంతో విచారణకు వెళ్లే సమయంలో భగీరథ్‌ను అరెస్టు చేసే అవకాశం ఉందని, అందుకే బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. 'బండి సంజయ్ కుమారుడు కావడంతోనే నిరాధారంగా పోక్సో చట్టాన్ని ప్రయోగించారు.. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పొలిటికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు.. నిందితుడిని సామాన్యుడిలాగే పరిగణించి న్యాయం చేయాలి' అని ఆయన కోరారు. తమ వాదనలు వినిపించడానికి సమయం కావాలని బాధితురాలి తరఫు న్యాయవాది కోరడంతో మధ్యంతర బెయిల్‌పై శుక్రవారం తుది నిర్ణయం తీసుకుంటామని కోర్టు వెల్లడించింది. కాగా, ముందస్తు బెయిల్ రావడానికి వారం సమయం పట్టేలా ఉండటంతో ఆ లోపు అరెస్టు కాకుండా ఉండేందుకు భగీరథ్ న్యాయవాది మధ్యంతర బెయిల్ కోరారు. దీనిపై కోర్టు శుక్రవారం ఇచ్చే ఆదేశాలు కీలకం కానున్నాయి. బాలికపై లైంగిక దాడి, ఇతర నేరారోపణల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. బండి సాయి భగీరథ్ కోసం గాలింపు చర్యలు మొదలుపెట్టిన పేట్ బషీరాబాద్ పోలీసులు మంగళవారం కరీంనగర్‌కు వెళ్లి విచారణ నిమిత్తం భగీరథ్‌ను వెంట తీసుకుని బుధవారం మధ్యాహ్నం 2గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని అతడి మేనమామ వంశీకృష్ణకు నోటీసులు అందజేశారు. అయితే బుధవారం మధ్యాహ్నం నిందితుడు విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాలతో తాను ఈ రోజు విచారణకు హాజరుకాలేకపోతున్నానని, పూర్తి ఆధారాలతో ఈ నెల 15న హాజరై పోలీసులకు సహకరిస్తానని, రెండు రోజుల గడువు ఇవ్వాలంటూ పోలీసులకు పంపిన ఈ'మెయిల్‌లో పేర్కొన్నాడు. ఇప్పుడు బెయిల్ పిటిషన్‌పై కోర్టు విచారణ వాయిదా వేయడంతో 15న విచారణకు హాజరవుతాడా లేదా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

## కేటీఆర్‌తో ఆస్ట్రేలియా

# హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ

**హైదరాబాద్, మే 14 :**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో దేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ గురువారం సమావేశమయ్యారు. నందినగర్‌లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు , ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై తెలంగాణఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు సాగాయి. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# మరోమారు తెరపైకి ఫార్ములా ఈ-రేస్ కేసు

**హైదరాబాద్, మే 14 :**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా`ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31న విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. కేటీఆర్‌తో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్, ఏ3 హెచ‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్‌సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ`కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎలఎన్ రెడ్డిలు సహా ఎఫఈఓ సంస్థ ప్రతినిధులను ఏసీబీ ప్రశ్నించింది. దీని నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి.

## శిక్షణ, పాఠ్యాంశాల్లో

# ఆధునికత ఉండాలి

**హైదరాబాద్, మే 14:**

ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా గ్రేహౌండ్స్ సిబ్బందికి అందిస్తున్న శిక్షణ ప్రమాణాలు, పాఠ్యాంశాలు, మాడ్యూల్స్‌లో నిరంతరం ఆధునికత ఉండాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రధానమైన గ్రేహౌండ్స్ కార్యకలాపాలపై ఆయన గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన డీజీపీ¾ గ్రేహౌండ్స్ నిర్వహిస్తున్న వివిధ ఆపరేషన్లు, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించారు. మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో గ్రేహౌండ్స్ ప్రదర్శిస్తున్న తీరును, వారికి అప్పగించిన ఇతర బాధ్యతల నిర్వహణను ఈ సందర్భంగా డీజీపీకి అధికారులు వివరించారు. కార్యకలాపాల సామర్థ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా అత్యున్నతస్థాయి పోరాట పటిమను చాటాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి క్రమం తప్పకుండా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించాలని, కఠినమైన శిక్షణ ద్వారా బలగాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గ్రేహౌండ్స్ బలాన్ని తగ్గించే అంశంపై కూడా డీజీపీ సుదీర్ఘంగా చర్చించారు. గ్రేహౌండ్స్‌కు సంబంధించి 708 సరెండర్డ్ పోస్టుల ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని అధికారులకు వివరించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి తగిన ఉత్తర్వులు అందిన తర్వాతే సిబ్బందిని తిరిగి మాతృ విభాగాలకు పంపే ప్రక్రియను చేపడతామని స్పష్టం చేశారు. గ్రేహౌండ్స్ సిబ్బంది కనబరుస్తున్న అంకితభావం, వృత్తి నైపుణ్యాన్ని ఈ సందర్భంగా డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. దేశంలోనే అత్యుత్తమ మావోయిస్టు వ్యతిరేక దళాల్లో ఒకటిగా గ్రేహౌండ్స్‌కు ఉన్న పేరును కాపాడాలని, క్రమశిక్షణ, ముందస్తు సన్నద్ధతతో తమ ప్రత్యేకతను చాటుకోవాలని సూచించారు. డీజీ ఆపరేషన్స్( గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్) డాక్టర్ అనిల్ కుమార్, గ్రూప్ కమాండర్ రాఘవేందర్ రెడ్డి, గ్రేహౌండ్స్ అధికారులు సమీక్షా సమావేశానికి హాజరయ్యారు.



# ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

- **ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు**
- **మార్పులకు సిద్ధం అవుతున్న బోర్డు**






**హైదరాబాద్, మే 14:**

ఇంటర్ విద్యా విధానంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. 202627 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటివరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా, కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు. ప్రత్యేకంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కొత్త విధానం ప్రకారం.. ఇంటర్ ఫస్టియర్‌లో, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. దీంతో విద్యార్థులు కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మ్యాథమేటిక్స్ బోధనలోనూ కీలక మార్పులు తీసుకురానుంది. సంప్రదాయ పద్ధతికి బదులుగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేయనుంది. దీంతో విద్యార్థులు సూత్రాలను అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యనభ్యసించడం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు గ్□నైల్ పరీక్ష నిర్వహిస్తుండగా, కొత్త విధానంలో దాన్ని 60 మార్కులకు తగ్గించనుంది. అదేవిధంగా యాక్టివిటీలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ప్రాధాన్యం పెంచే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఇంటర్ పరీక్షలు 100 మార్కులకు నిర్వహించగా, ఇకపై వాటిని 80 మార్కులకు నిర్వహించనున్నట్లు సమాచారం. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా విభాగాల్లో 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనుంది. ఇందులో ప్రాజెక్టులు సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్‌రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఒక్క గ్□నైల్ పరీక్ష ఆధారంగా కాకుండా, ఏడాది పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి రానుంది. ఈ సంస్కరణలు జాతీయ విద్యా విధానం(ఔఇఖ)కు అనుగుణంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ విద్యా విధానంలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## కేరళ సీఎం అభ్యర్థి సతీశన్‌కు
# రేవంత్ అభినందనలు



**హైదరాబాద్, మే 14:**

కేరళ ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళ ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళ దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. కేరళ మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఇంధన పొదుపుపై తెలంగాణ సర్కార్ దృష్టి

**హైదరాబాద్, మే14:**

ఇంధన వినియోగాన్ని తగ్గించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇంధన కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వినియోగాన్ని నియంత్రించాలని ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల రాష్ట్రాలకు సూచించిన నేపథ్యంలో తెలంగాణ సీఎంవో కూడా చర్యలపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం హైదరాబాద్ నగర పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ పరిమిత వాహనాలతోనే సాగుతున్నట్లు సమాచారం. అత్యవసర భద్రతా అవసరాలు ఉన్న సందర్భాలను మినహాయించి రెండు నుంచి మూడు వాహనాలతోనే ప్రయాణాలు కొనసాగుతున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఈ విధానాన్ని మరింత విస్తరించే అంశంపై అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

సిటీ బయట పర్యటనల సమయంలో కూడా కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించే అవకాశాలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. సీఎం కాన్వాయ్‌తో పాటు మంత్రుల వాహన శ్రేణులపైనా ఇదే విధానాన్ని అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఢిల్లీలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో 60 శాతం వాహనాలను తగ్గించినట్లు సమాచారం. అలాగే అక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు కొన్ని రోజుల పాటు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన కాన్వాయ్‌లో సగం వాహనాలను తగ్గించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. గురువారం నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## మీ సేవ ద్వారా మరో
# పోటీ పరీక్ష హాల్ టికెట్లు

- **వాట్సాప్ ద్వారా నే నుంచి డీఈఈ సెట్ హాల్ టికెట్లు**




**హైదరాబాద్, మే 14 :**

తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ) విభాగం, డీఈఈ సెట్ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) హాల్ టికెట్లను మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్‌లో అందుబాటులోకి తీసుకు వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థులు ఈనెల 15న ఉదయం 10 గంటల నుంచి వాట్సాప్ ద్వారా తమ హాల్ టికెట్లను వెంటనే పొందవచ్చు. డీఈఈ సెట్ పరీక్ష ఈ నెల 21, 22 తేదీల్లో జరగనుంది.

హాల్ టికెట్ పొందే విధానం

అధికారిక మీ సేవ వాట్సాప్ నంబర్ 8096958096ను మీ సేవ తెలంగాణ పేరుతో సేవ్ చేసుకోవాలి. వాట్సాప్ ఓపెన్ చేసి హాయ్ (Hi) అని మెసేజ్ పంపాలి. డీఈఈ సెట్ హాల్ టికెట్ అని టైప్ చేయాలి. మెనూలో కనిపించే ఓపెన్ సర్వీస్ ఎంపికపై క్లిక్ చేయాలి. అవసరమైన వివరాలు నమోదు చేయాలి. పేమెంట్ ఐడీ, అప్లికేషన్ నంబర్, మొబైల్ నంబరు, డేట్ ఆఫ్ బర్త్ వివరాలు సమర్పించిన వెంటనే డీఈఈ సెట్ హాల్ టికెట్ వాట్సాప్‌లో అందుతుంది.

ఈ సేవ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు పరీక్షలకు సంబంధించిన సేవలు వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయి. రాష్ట్ర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకంగా, సులభమైన డిజిటల్ సేవలను అందించాలనే లక్ష్యంతో, ఐటీ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీ సేవ ద్వారా పౌర సేవలను మరింతగా విస్తరిస్తూ ముందుకు సాగుతోంది. గత ఏడాది నవంబరు 18న ప్రారంభమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన డిజిటల్ సేవల వేదిక అయిన మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ సేవల ద్వారా ప్రజలకు మరింత సులభంగా ప్రభుత్వ సేవలను అందిస్తోంది. మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ సేవలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే ఈ వేదిక అత్యంత వేగంగా ప్రజాదరణ పొందిన డిజిటల్ పౌర సేవా వేదికలలో ఒకటిగా నిలిచింది.

## భార్యతో గొడవ..
## నాటు తుపాకీతో కాల్చుకుని భర్త ఆత్మహత్య

**కామారెడ్డి, మే 14:**

లింగంపేట మండలం మోతె గ్రామంలో దారుణ ఘటన వెలుగు చూసింది. నాటు తుపాకీతో కాల్చుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మోతె గ్రామానికి చెందిన ఇంద్రజిత్ సింగ్‌కి ఓ మహిళతో కొన్నేళ్ల కిందట వివాహం అయ్యింది. కొన్నాళ్లపాటు బాగానే సాగిన వారి కాపురంలో వివాదాలు మొదలయ్యాయి. దీంతో తరచూ గొడవలు పడుతూ ఉండేవారు. గురువారం కూడా వారి మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. అయితే, ఈసారి వివాదం మాటలతో ముగిసిపోలేదు. తరచూ గొడవలతో విసిగిపోయిన ఇంద్రజిత్ సింగ్ కఠిన నిర్ణయం తీసుకున్నాడు. తన వద్ద ఉన్న నాటు తుపాకీ తీసుకుని భార్య ముందే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ కొనసాగుతోందని తెలిపారు



# యువత భవిష్యత్తుతో చెలగాటమా?

**హైదరాబాద్, మే14 :**

నీట్ యూజీ 2026 రద్దు నిర్ణయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని యువత భవిష్యత్తును దెబ్బతీసే ఏకపక్ష, నిర్లక్ష్యపూరిత చర్యగా అభివర్ణించిన ఆయన.. దేశవ్యాప్తంగా లక్షలాది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనలోకి నెట్టబడ్డాయని విమర్శించారు. కష్టపడి సంవత్సరాల పాటు సిద్ధమైన విద్యార్థుల కలలను కేంద్ర వైఫల్యం ఛిద్రము చేసిందని అన్నారు.

పరీక్షా వ్యవస్థలో వరుస పేపర్ లీక్‌లు, పరీక్షల రద్దులు దేశ విద్యా పరిపాలనలో తీవ్రమైన లోపాలను బహిర్గతం చేస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. గత దశాబ్దంలో అనేక కీలక పరీక్షలు లీకేజీలు, అవకతవకల కారణంగా వివాదాల్లో చిక్కుకున్నప్పటికీ బాధ్యులపై కఠిన చర్యలు కనిపించలేదని విమర్శించారు. పేపర్ లీక్ జరిగితే విద్యార్థులే మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని.. కానీ పాలనా బాధ్యత వహించాల్సిన వ్యవస్థ మాత్రం తప్పించుకుంటోందని అన్నారు. నీట్ రద్దు ప్రభావం సాధారణ పరిపాలనా నిర్ణయం కాదని, ఇది దేశవ్యాప్తంగా విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీసే పరిణామమని రేవంత్ వ్యాఖ్యానించారు. పెద్ద నోట్ల రద్దు సమయంలో ప్రజలు ఎదుర్కొన్న అనిశ్చితి మాదిరిగానే, ఇప్పుడు విద్యార్థులు భవిష్యత్తుపై గందరగోళంలో పడిపోయారని పేర్కొన్నారు. తమ పిల్లల చదువు కోసం అప్పులు చేసిన కుటుంబాలు, నగలు అమ్ముకున్న తల్లిదండ్రుల ఆశలు ఒక్కసారిగా సంక్షోభంలో పడటం బాధాకరమన్నారు.

దేశంలో పరీక్షల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయని, అనేక రాష్ట్రాల్లో ప్రధాన నియామక, ప్రవేశ పరీక్షలు వరుసగా వివాదాలకు గురవుతున్నాయని సీఎం గుర్తుచేశారు. ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పలు పరీక్షల లీకేజీల ఆరోపణలు రావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పరీక్షా వ్యవస్థను పారదర్శకంగా, నమ్మకంగా నిర్వహించాల్సిన కేంద్రం.. చట్టాలు తీసుకొచ్చినా అమలు విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆరోపించారు.

విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడవద్దని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థి పక్షాన నిలుస్తుందని, యువత భవిష్యత్తును కాపాడేందుకు అవసరమైన ప్రతి వేదికపై పోరాడుతామని స్పష్టం చేశారు. పరీక్షలు కేవలం ఉద్యోగాలు, ప్రవేశాల కోసం మాత్రమే కాకుండా కోట్లాది కుటుంబాల ఆశలతో ముడిపడి ఉంటాయని.. అలాంటి వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం దేశ భవిష్యత్తుతో ఆడుకోవడమేనని హెచ్చరించారు.మొత్తంగా, నీట్ యూజీ రద్దు అంశాన్ని రేవంత్ రెడ్డి కేవలం విద్యా సమస్యగా కాకుండా.. దేశ యువత ఆత్మవిశ్వాసం, అవకాశాలు, కుటుంబాల భవిష్యత్తును ప్రభావితం చేసే జాతీయ సంక్షోభంగా ప్రస్తావించడం రాజకీయంగానూ చర్చనీయాంశమైంది.

# విద్య ఎవరి సొత్తు కాదు

**హైదరాబాద్, మే 14 :**

విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం అంటే విద్య వినయాన్ని ఇస్తుంది.. వినయం వ్యక్తిని గొప్పవాడిని చేస్తుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలి అని క్రీడలు, యువజన సంక్షేమ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. బంజారాహిల్స్ కొమురంభీం భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ బానిసత్వం నుంచి విద్య బయటకు తీసుకువస్తుందని నెల్సన్ మండేలా, మహాత్మా జ్యోతిరావు పూలేలు చెప్పారన్నారు. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నందున 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలని పిలుపునిచ్చారు. వంద సంవత్సరాలుగా చేయని కుల గణనను ప్రజా ప్రభుత్వం చేసిందని చెప్పారు. విద్యలో ఒత్తిడి ఉండొద్దని 25 వేల మంది టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామని, అవకాశాన్ని సృష్టించుకున్నవాళ్లే సమర్థులు అవుతారని అన్నారు. తెలంగాణ రైజింగ్‌లో ప్రతీ విద్యార్థి భాగం కావాలన్నారు. సరస్వతి దేవికి రంగు, రూపు తేడా ఉండదు.. విద్యపై మనం చూపే ఏకాగ్రతే మనల్ని ముందుకు నడిపిస్తుంది అని అన్నారు. రాజకీయాలు అనగానే వ్యతిరేక ధోరణిని విడనాడాలని, భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై చట్టాలు చేయాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, ఎంజేపి సెక్రటరీ సైదులు, బీసీ కమిషన్ సభ్యులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్‌లో భారీ అగ్నిప్రమాదం

- **ఎలక్ట్రిక్ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు**



**హైదరాబాద్, మే 14:**

హయత్‌నగర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాపులో మొదలైన మంటలు.. క్షణాల్లోనే పక్కనే ఉన్న పరుపుల షాపుకు విస్తరించి భీభత్సాన్ని సృష్టించాయి. ఎగిసిపడుతున్న మంటలు, దట్టమైన పొగతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ముందుగా జయశ్రీ ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ షాపులో మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్కనే ఉన్న పరుపుల తయారీ షాపుకు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత రెట్టింపైంది. పరుపులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి.. ఆ రెండు షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటల ధాటికి సమీపంలోని మరో రెండు షాపులు కూడా స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో షాపుల బయట నిలిపి ఉంచిన ఒక బైక్ కూడా పూర్తిగా కాలి బూడిదైపోయింది. సమాచారం అందుకున్న వెంటనే హయత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే, షాపు లోపల పరుపుల నిల్వలు ఉండటంతో.. మంటలు ఆరిపోయినట్టే కనిపిస్తూనే మళ్లీ మళ్లీ రాజుకున్నాయి. ఈ ఘటనలో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ప్రస్తుతం ఫైర్ సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తూ మంటలు పూర్తిగా ఆరిపోయేలా చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏసీబీకి చిక్కిన మరో లంచావతారం

- **10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**వరంగల్, మే14 :**

పూర్వీకుల ఆస్తిని తన పేరుపై మ్యుటేషన్ కోసం సంప్రదించిన బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తహసీల్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న జి రాంబాబు బాధితుడి నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా గురువారం వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఆర్‌ఐపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీబీ అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని, వాట్సాప్ నంబర్ 9440446106కు కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

## సుబోధ్ సింగ్ గ్యాంగ్ పనే..

**మొదటిపేజీ తరువాయి**

వివిధ రాష్ట్రాల్లో గాలిస్తున్నట్లు తెలిపారు.

ఈ నెల 3న జరిగిన దోపిడీలో దుండగులు జ్యువెలరీ షాపులోకి చొరబడి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు ఉద్యోగులు గాయపడగా, భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, వజ్రాలను దోచుకెళ్లారు. ఈ మొత్తం ఆపరేషన్‌కు బీహార్‌లోని పూర్నియా జైలులో ఉన్న సుబోధ్ సింగ్ ప్రధాన సూత్రధారిగా వ్యవహరించినట్లు దర్యాప్తులో తేలిందని కమిషనర్ తెలిపారు.

సుబోధ్ సింగ్ ముఠా బీహార్, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో పలు దోపిడీలకు పాల్పడిన చరిత్ర ఉందన్నారు. తెలంగాణలో ఇంత ప్రణాళికాబద్ధంగా దోపిడీ చేయడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

దోపిడీకి నాయకత్వం వహించిన రఘునాథ్ కర్మకార్‌తో పాటు రవిష్ కుమార్, మెహతాబ్ ఖాన్‌లను పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిలో ఇద్దరు కాల్పులకు పాల్పడిన షూటర్లు కాగా, మరొకరు సహాయకుడిగా వ్యవహరించినట్లు తెలిపారు.

దోపిడీకి రెండు నెలల ముందే నిందితులు ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో బయటపడింది. అనంతరం కరీంనగర్‌ను లక్ష్యంగా ఎంచుకుని పథకం అమలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘటన తర్వాత నిందితులు బైక్‌లపై ధర్మపురికి చేరుకుని అక్కడి నుంచి మూడు బృందాలుగా విడిపోయి రైళ్లు, బస్సుల ద్వారా పరారైనట్లు వెల్లడించారు.

అరెస్టయిన నిందితుల నుంచి రూ.51 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ కార్డులు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని, సుబోధ్ సింగ్‌ను విచారించేందుకు కోర్టు అనుమతి కోరనున్నట్లు కమిషనర్ వివరించారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**నల్లగొండ/ఖమ్మం, మే 14 :**

రాష్ట్ర వ్యవసాయ చరిత్రలోనే ముందెన్నడూ లేని రీతిలో రబీ సీజన్‌లో 65 లక్షల ఎకరాలకుపైగా వరి సాగు జరిగిందని, 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ధాన్యం దిగుబడితో పాటు కొనుగోళ్లలో చరిత్రలో రాష్ట్రం ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించేందుకు ఆయన నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో గురువారం పర్యటించారు. నల్లగొండ జిల్లాలో సహచర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరు లక్ష్మణ్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర నల్గొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. అదేవిధంగా ఖమ్మం జిల్లాలో సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు మోసం జరిగితే ఉపేక్షించబోమని, చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని, చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని స్పష్టం చేశారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం రూ.22,000 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణాలో జాప్యం తగదని, అందుబాటులో ఉన్న వాహనాలు వినియోగించి సత్వరమే రవాణా చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. కనగల్ మండలంలోని చేట్లచెన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంత్రి స్వయంగా కొనుగోలు ప్రక్రియను పరిశీలించి పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన హమాలీలతో ఆయన మాట్లాడారు. భారీ స్థాయిలో ధాన్యం తరలింపులో వారు అందిస్తున్న సేవలను అభినందిస్తూ వారికి మెరుగైన వసతులు, సంక్షేమ సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదే మండలంలోని బాలాజీ రైస్ మిల్లును సందర్శించి మిల్లింగ్ కార్యకలాపాలు, కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ కేంద్రాలకు తరలింపు పనులను సమీక్షించారు. ఖమ్మం జిల్లాలోని నాయకన్‌గూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మంత్రి కొనుగోళ్లు, మిల్లులకు ధాన్యం తరలింపును వేగవంతం చేసే చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. అన్ని జిల్లాల కలెక్టర్లు అందుబాటులో ఉన్న అన్ని లారీలు, డీసీఎంలను కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులు, గోదాములకు ధాన్యం తరలింపునకు వినియోగించాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. అవసరమైతే ఇసుక రవాణా, ఇతర ప్రాధాన్యం లేని పనుల్లో నిమగ్నమైన వాహనాలను కూడా బలవంతంగా ధాన్యం రవాణాకు వినియోగించాలని స్పష్టం చేశారు. రబీ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని సిమెంట్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు తమ వద్ద ఉన్న లారీలను ధాన్యం రవాణాకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చివరి గింజ ఎత్తేవరకు కొనుగోళ్లు కొనసాగుతాయి.. రైతులకు ఇది ప్రభుత్వ హామీ అని మంత్రి స్పష్టం చేశారు. రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 18.67 కోట్ల గన్నీ సంచులు సిద్ధంగా ఉంచామని, 1,800కిపైగా రైస్ మిల్లర్లు మిల్లింగ్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. దేశంలోనే నంబర్ 1 వరి ఉత్పత్తి రాష్ట్రంగా తెలంగాణను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇది కేవలం ధాన్యం కొనుగోలు కార్యక్రమం కాదు.. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.



సంపాదకీయం

# కాన్వాయ్‌ల కార్లు తగ్గితే పొదుపు కాదు!

అధికార పార్టీ నేతల విన్యాసాలు మొదలయ్యాయి. చమురు సంక్షోభం దృష్ట్యా ఖర్చులు తగ్గించుకోవాలని, వర్క్ ఫ్రమ్ హోమ్ పెరగాలని, బంగారం కొనొద్దని ఇలా..ప్రధాని పలు సూచనలు చేశారు. వాటిని బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్‌డిఎ పాలిత సిఎంలు స్వాగతించారు. ఇందులో కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను మాత్రమే తగ్గించారు. ప్రధాని కూడా కాన్వాయ్ తగ్గించారు. నిజానికి రాజకీయంగా దుబరా ఖార్చుల గురించి ఆలోచించడం లేదు. ఓ వైపు విమాన ఇంధన ధరలు పెంచడంతో విమానాలను రద్దు చేస్తున్నారు. ఇది సామాన్యులపై పెనుభారం మోపుతోంది. విదేశీయానం అంటే ప్రజలు ఎంజాయ్ చేయడానికి వెళ్లడం లేదు. తమ పిల్లల దగ్గరకు వెళ్లాలన్న తల్లిదండ్రులకు వియారన టిక్కెట్ ధరలు తడిసి మోపెడు అవుతున్నాయి. వీటిని ఆదా చేసేందుకు ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. కాన్వాయ్‌ల తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాదు. ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా ఉన్న వందలాది పతకాలు, రాజకీయ పార్టీల ఖర్చులు వంటివి తగ్గాలి. శాసనమండళ్లతో పెద్దగా పనిలేదు. జడ్పీటిసి, ఎంపిటిసిలతో పెద్దగా పనిలేదు. వీటిని తగ్గించాలి. ప్రజాప్రతినిధులు రెండేసి పెన్షన్లు తీసుకుంటున్నారు. ఈ పెన్షన్లను పూర్తిగా రద్దు చేయాలి. ఈ ఖర్చు ఎంతో లెక్క కట్టాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వేళ ఎక్కడ ఖర్చులు తగ్గించాలో మోడీ చెబితే బాగుంటుంది. ఆచరిస్తే మరీ మంచిది. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజాప్రతినిధులు ప్రజల డబ్బుతో విలాసాలు చేస్తున్నారు. దీనిపై ప్రధాని మోడీ దృష్టి సారించాలి. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును చూస్తున్నాం. వరుసగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్త బలోపేతానికి పొదుపు చర్యలు తీసుకోవాల్సిందే. కఠిన చర్యలకు ఉపక్రమించాలి. కేవలం కాన్వాయ్‌ల కార్లు రద్దుతో చేతులు దులుపుకుంటే సరిపోదు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలి, లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడు దారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం వంటి పరిణామాలన్నీ ఆర్థికసంక్షోభ తీవ్రతకు అద్దం పడుతున్నాయి.అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాల పై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగు తుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి. దీనికితోడు ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదని సూచనలు చేస్తున్నారు. ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా కూడా ఇదే విషయం చెప్పారు. ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేయడం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయిలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్ధనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్ధనీయం కాదు. పెట్రో ధరలు పెరగ్గానే అమాంతంగా అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. నిత్యావసరాలు ఆకాశాన్ని అంటుతాయి. కాబట్టి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. పొదుపు అన్నది ప్రజాప్రతినిదుల దుబారాలను తగ్గించడంతో మొదలు కావాలి. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కోనుగోళ్లను ఏడాదిపాటు నిలిపి వేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపడం తప్ప మరోటి కాదు. ప్రజలు త్యాగాలు చేస్తే ప్రజాప్రతినిధులు ఎంజాయ్ చేయడం ఎంతవరకు సమంజసం. లక్షల్లో జీతు, భత్యాలు, ఉచిత బంగళాలు, కరెంట్ ఫ్రీ, ఫోన్లు ఫ్రీ ఎందుకో చెప్పాలి. ఇవన్నీ ప్రజలను ఉద్ధరించే చర్యలు ఎంతమాత్రం కావు. దీనికితోడు చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, ఖరైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. పొదుపును సీరియస్‌గా తీసుకుని ప్రజాప్రతినిధుల జీతాలు, పెన్షన్లు రద్దు చేయాలి. వారి విదేశీ ప్రయాణాలను, విమానాలను వేసుకుని ఊరేగడాన్ని, హెలకాప్టర్లు వేసుకుని ఊరూరా తిరగడాన్ని అడ్డుకోవాలి. ఇవి మాత్రమే దేశానికి మేలు చేస్తాయి. ఈ దిశగా విప్లవాత్మక చర్యలకు దిగాలి.

# 'నా భారతదేశం - నా కర్తవ్యం' షురూ

- పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం..
- వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్'
- వారానికి ఒకరోజు 'నో వెహికల్ డే'..
- మంత్రులకు 'మండే మెట్రో' తప్పనిసరి
- ముఖ్యమంత్రి రేఖాగుప్తా కీలక నిర్ణయాలు..



**న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్ర మనం):** దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా నేతృత్వంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ నూతన విధానం రేపటి నుంచే అమల్లోకి రానుంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడంలో భాగంగా ముఖ్యమంత్రి తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేయడమే కాకుండా, అందులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే వినియోగించాలని నిర్ణయించి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. పౌరుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు 'నా భారతదేశం - నా కర్తవ్యం' పేరుతో 90 రోజుల పాటు సాగే ప్రత్యేక ఉద్యమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఉన్నతాధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా ఢిల్లీ మెట్రోలోనే ప్రయాణించాలని 'మండే మెట్రో' పేరుతో ప్రత్యేక నిబంధనను తీసుకువచ్చారు. సామాన్య ప్రజలు కూడా వారంలో కనీసం ఒక రోజైనా 'నో వెహికల్ డే' పాటించి సైకిళ్లు, బస్సులు వంటి పర్యావరణహిత రవాణా మార్గాలను ఎంచుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అలాగే, వచ్చే ఆరు నెలల వరకు ప్రభుత్వ శాఖలేవీ కొత్తగా పెట్రోల్, డీజిల్ లేదా ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయకూడదని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా వచ్చే ఏడాది వరకు అన్ని అధికారిక విదేశీ పర్యటనలను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మినహా ఎవరికీ విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది. మరోవైపు, ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 10 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో తీవ్రంగా ఉన్న వాయు కాలుష్య సమస్యను అదుపు చేసేందుకు ఈ వర్క్ ఫ్రమ్ హోమ్, మెట్రో వినియోగం వంటి చర్యలు ఎంతగానో తోడ్పడతాయని పర్యావరణ నిపుణులు



## మహా సీఎం వినూత్న ప్రయోగం

**రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై విధానసభకు ఫడ్నవీస్ • కాన్వాయ్‌కి స్వస్తి పలికి బైక్‌పై పయనం..**

**ప్రధాని మోదీ పిలుపుతో కీలక నిర్ణయం**

**ముంబై, మే 14 (ఆంధ్ర మనం):** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపునకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వినూత్నంగా స్పందించారు. ఇంధన పొదుపు దిశగా ఒక అడుగు ముందుకేసి, తన అధికారిక కార్ల కాన్వాయ్‌ని పక్కన పెట్టి ద్విచక్ర వాహనంపై ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. గురువారం మహారాష్ట్ర శాసన మండలికి కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు ఆయన తన నివాసం నుండి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై విధాన భవన్‌కు బయలుదేరారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి ఆశిష్ షెలార్ మరియు భద్రతా సిబ్బంది కూడా ద్విచక్ర వాహనాలపైనే అనుసరించడం విశేషం. ఈ సందర్భంగా తాను బైక్‌పై వెళ్తున్న ఫోటోలు, వీడియోలను ముఖ్యమంత్రి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు దేశం కోసం ఇది తన వంతు సహకారమని, ప్రతి ఒక్కరూ దేశ ప్రయోజనాల దృష్ట్యా తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని స్వయంగా తన కాన్వాయ్‌ను 15 వాహనాల నుండి కేవలం రెండు వాహనాలకు తగ్గించుకున్న సంగతి తెలిసిందే. ప్రధాని బాటలోనే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా పలువురు నేతలు ఇప్పటికే తమ కాన్వాయ్‌లను తగ్గించుకోగా, ఫడ్నవీస్ ఏకంగా బైక్ ప్రయాణాన్ని ఎంచుకుని తన నిబద్ధతను చాటుకున్నారు. మరోవైపు, దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఇంధన పొదుపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు మెట్రో స్టేషన్ల మీదుగా నడిచే షటిల్ బస్సులను వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించగా, సామాన్య ప్రజలు కూడా వ్యక్తిగత వాహనాలకు బదులు మెట్రో, బస్సుల్లో ప్రయాణించాలని అధికారులు కోరుతున్నారు. ఇలా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కఠినమైన పొదుపు చర్యలను అమలు చేస్తున్నాయి.

## మూడో దశ 'సర్' అమలుకు
# ఈసీ గ్రీన్ సిగ్నల్

**16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ**

**జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు • కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన**

**న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్ర మనం):** దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, దేశ రాజధాని ఢిల్లీ, చండీగఢ్, దాద్రా-నగర్ హవేలి- దమన్-దియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ 'సర్' పక్రియ నిర్వహించనున్నారు. కాగా, 'సర్' మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), జనాభా గణనకు రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) సహాయంతో ఇంటింటికి వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని ఈసీ తెలిపింది. మే 30 నుంచి అక్టోబర్ 14 వరకు 'సర్' మూడో దశ పక్రియ జరుగుతుందని పేర్కొంది. జూలై 5 నుంచి అక్టోబర్ 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ కొనసాగుతుందని ఈసీ వెల్లడించింది.

## మద్యం పాలసీ కేసు విచారణ నుంచి తప్పుకున్న
# హైకోర్టు న్యాయమూర్తి

**ఆప్ నేతలకు కోర్టు ధిక్కార నోటీసులు..**

**న్యూఢిల్లీ, మే 14:** ఢిల్లీ మద్యం పాలసీ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలపై కోర్టు ధిక్కార చర్యలకు ఉపక్రమించిన అనంతరం, ఈ కేసు విచారణ నుంచి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తప్పుకున్నారు. ఈ కేసును ఇకపై వేరే ధర్మాసనం విచారిస్తుందని ఆమె స్పష్టం చేశారు. న్యాయమూర్తులను, కోర్టు విచారణలను కించపరిచేలా సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని హైకోర్టు అత్యంత తీవ్రంగా పరిగణించింది. న్యాయపరమైన అంశాలను కోర్టులో ఎదుర్కోవాల్సింది పోయి, వాటిని సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి న్యాయవ్యవస్థపై వ్యతిరేకతను పెంచేలా ప్రచారం చేస్తున్నారని కోర్టు మండిపడింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించినందుకు సమాధానం ఇవ్వాలంటూ అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, నేతలు వినయ్ మిశ్రా, సౌరభ్ భరద్వాజ్‌లకు కోర్టు ధిక్కార నోటీసులు జారీ అయ్యాయి. రాజకీయ పోరాటాలు ప్రజాక్షేత్రంలో జరగాలని, కానీ న్యాయస్థానాల తీర్పులను, న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని కోర్టు హెచ్చరించింది. మద్యం పాలసీ కేసులో ఇప్పటికే రాజకీయ ప్రకంపనలు కొనసాగుతుండగా, హైకోర్టు తీసుకున్న ఈ తాజా నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## చక్కెర ఎగుమతులపై
# కేంద్రం నిషేధం

**ధరల నియంత్రణే లక్ష్యం**

**వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకు ఆంక్షలు..**

**తక్షణమే అమల్లోకి ఉత్తర్వులు**

**న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్ర మనం)4:** దేశీయ మార్కెట్‌లో చక్కెర ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారతదేశం నుంచి చక్కెర ఎగుమతులను తక్షణమే నిలిపివేస్తున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించింది. ఈ నిషేధం వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. చక్కెర నిల్వలు తగ్గడం, దేశీయ మార్కెట్‌లో ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో కేంద్రం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం ముడి చక్కెర, తెల్ల చక్కెర, శుద్ధి చేసిన చక్కెర సహా అన్ని రకాల చక్కెర ఎగుమతులపై నిషేధం అమలులోకి రానుంది. గతంలో నియంత్రిత విభాగంలో ఉన్న ఎగుమతులను ఇప్పుడు పూర్తిగా నిషేధిత విభాగంలోకి మార్చినట్లు విదేశీ వాణిజ్య నియంత్రణ సంస్థ వెల్లడించింది. ముందస్తు అనుమతులు లేదా లైసెన్సులు ఉన్నా కూడా ఇకపై సాధారణ ఎగుమతులకు అవకాశం ఉండదు. అయితే, యూరోపియన్ దేశాలు, అమెరికాతో ఉన్న ప్రత్యేక కోటా ఒప్పందాల ప్రకారం ఇప్పటికే కుదిరిన పరిమిత ఎగుమతులకు మాత్రం ఈ నిషేధం నుండి మినహాయింపునిచ్చారు. ప్రపంచంలోనే చక్కెర ఉత్పత్తిలో భారత్ రెండో అతిపెద్ద దేశంగా ఉండటంతో, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాల్లో చక్కెర ధరలు పెరిగే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. దేశీయంగా వినియోగదారులకు ఈ నిర్ణయం ఊరటనిచ్చినప్పటికీ, విదేశీ ఆర్డర్లపై ఆధారపడిన చక్కెర కర్మాగారాలు మరియు ఎగుమతి వ్యాపారులపై దీని ప్రభావం పడవచ్చని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయినప్పటికీ, దేశీయ అవసరాలకే తమ మొదటి ప్రాధాన్యమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.



# నీట్ పై నిరసన సెగ.. భగ్గుమన్న ప్రజాసంఘాల ఐక్యవేదిక

**ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు ముందడి ఇస్రాయిల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం**




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యం లో నీట్ కి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల అధ్యక్షులు మందడి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి మెమోరండం సమర్పించారు ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ మాట్లాడుతూ నీట్ లీకేజీ పై ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు.నీట్ ప్రశ్నాపత్రం మెసేజ్ ద్వారా నీట్ ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తప్పుపడుతూ కేంద్ర ప్రభుత్వం మోడీ తీసుకున్న ఈ నిర్ణయం మూలంగా దేశవ్యాప్తంగా 28 లక్షల మంది విద్యార్థులు నిరాశ్రయులు అయినారని అందులో తెలంగాణ నుంచి సుమారుగా 70 వేల మంది విద్యార్థులు రోడ్డు న పడ్డారని,ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 98సార్లు ప్రశ్నపత్రాలు లీకేజీ జరిగి విద్యార్థులు రోడ్డున పడ్డారని ఈ 12 సంవత్సరాలలో దళిత పేద విద్యార్థులను రోడ్డున పడేసిందని వాపోయారు. నీట్ పరీక్ష రద్దవటంతోదేశవ్యాప్తంగా విద్యార్థుల ఆగ్రహ జ్వాలలు పగిలిస్తున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) పరిధిలో జరుగుతున్న విధానాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇటీవల తీసుకున్న నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడింది. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో కూడా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. సంఘాల నాయకులు మాట్లాడుతూ, నిట్ పరిపాలన వ్యవహార శైలి విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వినతి పత్రం సమర్పిస్తూ, రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడాలని కోరారు. విద్యా వ్యవస్థలో సమానత్వం, న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థులు ఈ నిరసనలకు మద్దతుగా రోడ్డెక్కే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఇది కేవలం ఒక సంస్థకు పరిమితమైన సమస్య కాకుండా, విద్యా విధానాలపై దేశవ్యాప్తంగా పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఈ నిరసనలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమం లో బి.ఎస్.పి పాలేరు నియోజకవర్గ కన్వీనర్ వెన్నెబోయిన రమేష్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు గుగులోత్ మోహన్ బి.ఎస్.పి మండల నాయకులు కొమ్ము పూలే మండల కాంగ్రెస్ నాయకులు భాజ సత్యనారాయణ పులకాని సంజీవరెడ్డి మందుల వెంకన్న సిపిఎం మండల నాయకులు షేక్ ఇమామ్, లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## రంగనాథ్ మిశ్రా కమిషన్ ను వెంటనే అమలుచేయాలి

**దళిత క్రైస్తవులపట్ల అన్నీ రాజకీయ పార్టీల వైఖరి తెలపాలి**




**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట మండలం కేసారం , బేతెస్థ ప్రార్ధన మందిరం నందు సూర్యాపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ ఏర్పుల క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో జరిగిన దళిత క్రైస్తవ సమావేశంలో ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కల్పించాలని, అది రాజ్యాంగం కల్పించిన హక్కు గా డిమాండ్ చేశారు.గతంలో భారత ప్రభుత్వం రంగనాథ్ మిశ్రా జాతీయ కమిషన్ (2004)ను ఏర్పాటు చేసిందనీ మాజీ సీజేఐ రంగనాథ్ మిశ్రా అధ్యక్షతన, ఇది 2007లో దళిత క్రైస్తవులు వివక్షను ఎదుర్కొంటున్నారని నివేదికను ప్రభుత్వంనకు సమర్పించారనీ దానిని వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు దేశం లోని అన్నీ రాజకీయ పార్టీల వైఖరి కూడా తెలపాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమం లో రెవ. బొక్క ఏలీయా రాజు, రెవ. డా. డి. జాన్ ప్రకాష్, రెవ. పంది మార్క్,పాస్టర్ కొండేటి లాజర్, పాస్టర్ ప్రేమ్ సాగర్,పిట్టల సామెల్,రెవ. సి. హెచ్. కిరణ్ కుమార్,యల్క ప్రభాకర్,మామిడి కృష్ణ, ఎన్.భాస్కర్, డి. రాజు,బాణాల సైమన్, విజయలక్ష్మి,ప్రేమ్ సాగర్, గెర్షోము, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## తిరుమలాయపాలెం మండల కేంద్రంలో పిఓఏల వినూత్న నిరసన



- అంబేద్కర్ విగ్రహానికి ముందస్తు సమ్మె నోటీసు అందజేసిన వివోఏ ల జేఏసీ
- వివో ఏ జేఏసీ మండల జిల్లా అధ్యక్షురాలు సుశీల

**మ్మం, రాజముద్ర న్యూస్:** గత గ్రామాలలో గ్రామాలలో నిరంతరం ప్రజలను చైతన్య పరుస్తూ ఎంతో ప్రాయాసపడి భారాన్ని కుటుంబ భారాన్ని మోస్తూ తక్కువ జీతాలతో ఎక్కువ ఫలితాన్ని ప్రభుత్వానికి అందిస్తున్న మమ్ములను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని కనీస ఉద్యోగస్తులుగా కూడా గుర్తింపు ఇవ్వడం లేదని వివోఏల జేఏసీ ఆధ్వర్యంలో పిఓఏ లు వినూత్న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి ముందస్తు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వివో ఎలా జేఏసీ అధ్యక్షురాలు సుశీల మాట్లాడుతూ ఈ నెల 6వ తారీకు నుంచి 18వ తారీకు వరకు తమ అమూల్యమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. 18వ తారీకు లోపు సమస్యలు పరిష్కరించని పక్షంలో 18వ తారీకు నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. వివోఏలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెండింగ్ బకాయిల చెల్లింపు, పని భారం తగ్గింపు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వివో ఏ ల జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల మండల కార్యదర్శి గుగ్గిళ్ళ ఉమా పోలిశెట్టి అరుణ నూకల వసంత సామినేని కరుణ మేకల కృష్ణవేణి మెట్టు స్వరూప రాణి గోపోజి ఉపేంద్ర పద్మ రాములమ్మ గుగ్గిళ్ళ విజయ నాగమణి కళ్యాణి సువర్ణ నీరుడు లలిత జయ పద్మ మండలం లోని వివోఏలు, , జేఏసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమాజ హితులు ఆర్యవైశ్యులు....



**మానవసేవే మాధవసేవ ఆర్యవైశ్యుల సిద్ధాంతం**

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** సమాజం మేలు కోరుకునే హితులు ఆర్య వైశ్యులని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, సుప్రీంకోర్టు అడ్వకేట్, రిటైర్డ్ జడ్జి, శ్రీ వాసవి సేవా సమితి జాతీయ లీగల్ అడ్వైజర్ నేరెళ్ల మాలి యాద్రి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 36 వ వార్డులో శ్రీ వాసవి సేవా సమితి నూతన జిల్లా కార్యాలయాన్ని శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. మానవసేవే మాధవసేవ అనే సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణలో చూపిస్తున్న కులస్తులు ఆర్యవైశ్యులని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా ఆర్యవైశ్యుల దక్కడం ఆనందంగా ఉందన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆర్యవైశ్యుల పాత్ర వెలకట్టలేనిది అన్నారు . నిరుపేదల కష్టాలు బాధలు చూసి చదివించే మనసు ఉన్న ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందు వరుసలో ఉన్నారన్నారు. శత్రువులంటూ లేకుండా జీవనం సాగించే ఆర్యవైశ్యులు ఎందరికో ఆదర్శం అన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ తమ మతం కోసం ప్రాణాలు సైతం ఇవ్వడానికి వెనకాడ బోరని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు దేవాలయాలకు తీసుకువెళ్లాలని దీని ద్వారా భారతీయ సంస్కృతి సంప్రదాయం భవిష్యత్ తరాలకు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు చెట్లను నాటుతూ వాటిని సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కరోనా సమయంలో శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణపట్నం సంబంధించిన మందును 30 వేల కు పైగా కుటుంబాలకు అందించామని సందర్భంగా గుర్తు చేశారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటూ ఏ చిన్న సమస్య ఉన్న పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, కే శ్రీనివాస రావు,కాంగ్రెస్ నాయకులు ఫరూక్, గౌరవ చైర్మన్ ఈగ దయాకర్ గుప్తా, జిల్లా అధ్యక్షుడు బచ్చు పురుషోత్తం, గౌరవ సలహాదారులు గోపారపు రాజు, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, రాచకొండ శ్రీనివాస్ సహాయ కార్యదర్శులు బచ్చు శ్రీనివాస్ ,సోమ సుమన్, తప్పి అనిల్ కుమార్, కోటా శివ, కర్నాటి కృష్ణ , బొల్లం సురేష్ ,సభ్యులు కొండ అనిల్ కుమార్, శ్రీరంగం రాము, సోమ ధనుంజయ్, మనసాని నాగేశ్వరరావు,మిట్టపల్లి రమేష్, బెలిదే శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్, చందా రాజశేఖర్ , గుడిపాటి రమేష్ వెంపటి శబరినాథ్, తల్లాడ రాము,బుక్క రమేష్, బచ్చు నీరజ, తెడ్ల పల్లవి, ఉప్పలంచు కృష్ణ,మహంకాళి సోమయ్య పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో బడిబాట కార్యక్రమం

**ఎంఈఓ ఆనంద్ రావు**



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలు భాగంగా రామారెడ్డి మండలం నందు ప్రతి పాఠశాలలో బడిబాట కార్యక్రమం పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశం నందు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వము అందచేస్తున్నటువంటి సౌకర్యాలను ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్, టెక్స్ట్ బుక్స్ నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్, షూస్ అందజేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది , ప్రతిరోజు ఉదయం టిఫిన్ తో పాటు పాలు రాగి జావా మధ్యాహ్నం లంచ్ ఇవ్వనున్నట్లుగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తెలియజేసినారు కావున మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించవలసినదిగా తల్లిదండ్రులను కోరడమైనది ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ రావు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీటి సౌకర్యాము, టాయిలెట్స్, ఉన్నత పాఠశాలలో సైన్స్ మ్యాస్ ల్యాబ్లు డిజిటల్ బోధనతో కూడిన విద్యా బోధన ఉపాధ్యాయులచే అందించబడుతుందని విద్యార్థులను మంచి ప్రతిభావంతులుగా తీర్చి దిద్దుతామని తెలియజేయడం జరిగింది కావున మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించవలసిందిగా ఎంఈఓ ఆనంద్ రావు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసినారు.

## ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పొంగులేటితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పాలేరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో రూ. 22 వేల కోట్లతో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడమే లక్ష్యమని వెల్లడించారు. హమాలీల కొరత ఉన్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని, వచ్చే 15 రోజుల పాటు లారీలను కేవలం ధాన్యం రవాణాకే కేటాయించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, సీపీ సునీల్ దత్, తహసిల్దార్ సైదులు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

- బీఎస్పీ హెచ్చరిక
- పోక్సో కేసులో ఆలస్యం ఎందుకు..? ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎన్నబోయిన రమేష్ యాదవ్



ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పుత్ర రత్న బండి సాయి భగీరథ ను వెంటనే అరెస్టు చేసి, హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ను పదవి నుండి తప్పించాలని బి ఎస్ పి పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు వెన్న బోయిన రమేష్ డిమాండ్ చేశారు గురువారం తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో నిర్వహించిన ప్రెస్‌మీట్ లో బహుజన్ సమాజ్ పార్టీ పాలేరు అసెంబ్లీ అధ్యక్షులు ఎన్నబోయిన రమేష్ యాదవ్ మాట్లాడుతూ, మైనర్ బాలికపై లైంగిక వేధింపులు, అత్యాచారయత్నం కేసులో ఆరోపణలు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదై వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం బాధాకరమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు భయపడి బాధిత కుటుంబానికి అన్యాయం చేస్తోందని ఆరోపించారు. మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలు పూర్తిగా అబద్ధాలని మండిపడ్డారు. ఈ ప్రభుత్వంలో చట్టాలు ధనికులు, అధికార వర్గాలకు ఒకలా.. సామాన్య ప్రజలకు మరోలా అమలవుతున్నాయని అన్నారు. అందువల్లే ఇప్పటివరకు బండి సాయి భగీరథ్‌పై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వెంటనే అరెస్ట్ చేయకపోతే బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పాలేరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే, మండల నాయకులు పోలేపొంగు నాగరాజు, కొమ్ము వీరబాబు, కొమ్ము కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**జూన్ 6 వరకు దరఖాస్తుకు అవకాశం : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** జిల్లాలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం కింద 2026-27 విద్యా సంవత్సరానికి గాను 1, 5 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఒకటో తరగతిలో 91 (నాన్ రెసిడెన్షియల్), ఐదో తరగతిలో 92 (రెసిడెన్షియల్) సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఈ నెల 16 నుండి జూన్ 6 సాయంత్రం 5 గంటల వరకు నస్పూర్ ఐడీఓసీ భవనంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబానికి ఒకరికి మాత్రమే వర్తించే ఈ పథకానికి గ్రామీణ ప్రాంతాల వారు రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారు రూ. 2 లక్షల వార్షిక ఆదాయ పరిమితి కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు నిర్ణీత దరఖాస్తులతో పాటు మీ సేవ ధ్రువీకరణ పత్రాలు, జనన సర్టిఫికేట్, ఆధార్, ఫోటోలు, మార్కుల జాబితా వంటి నకలు ప్రతులపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించి సకాలంలో అందజేయాలని కోరారు. దరఖాస్తు ఫారాలు కార్యాలయ పనివేళల్లో లభిస్తాయని, జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## హెచ్‌పీఎస్ బేగంపేటలో ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లాకు రెండు సీట్ల కేటాయింపు
- జూన్ 1న డ్రా పద్ధతిలో ఎంపిక

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్ (HPS)లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు షెడ్యూల్డ్ కులాల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు మొత్తం రెండు సీట్లు కేటాయించినట్లు పేర్కొన్న ఆయన, ప్రవేశం కోరే అభ్యర్థులు తప్పనిసరిగా జిల్లా నివాసులై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను కుల, ఆదాయ, నివాస, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు నకళ్లను జతచేసి ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నస్పూర్ ఐడీఓసీ భవనంలోని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు జూన్ 1, 2019 నుండి మే 31, 2020 మధ్య జన్మించి ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షల లోపు ఉండాలని కలెక్టర్ తెలిపారు. వచ్చిన దరఖాస్తుల నుండి జూన్ 1వ తేదీన డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని, అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## అదనపు కలెక్టర్ ను కలిసిన రాష్ట్ర పర్యావరణ వేత్త

- 'వాల్టా' చట్టంపై జిల్లాలో అవగాహన సదస్సు
- పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక చర్చ



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ రక్షణ అథారిటీ (వాల్టా) పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ బుధవారం రాత్రి జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కు పచ్చని మొక్కను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా 'వాల్టా' చట్టంలోని చెట్టు, మట్టి, నీరు సంరక్షణ అంశాల ప్రాముఖ్యతను, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పర్యావరణవేత్త వివరించారు. పర్యావరణ పరిరక్షణపై జిల్లా ప్రజలకు, అధికారులకు మరింత అవగాహన కల్పించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

## లక్షెట్టిపేట రైస్ మిల్లులో డీసీపీ ఆకస్మిక తనిఖీ

- ధాన్యం రవాణాలో జాప్యం జరగొద్దు
- రైతులకు ఇబ్బంది కలిగితే చర్యలు తప్పవు: డీసీపీ భాస్కర్



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని లక్షెట్టిపేట శ్రీరామ రైస్ మిల్లును మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లారీల ద్వారా ధాన్యం రవాణా జరుగుతున్న తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధాన్యం లోడింగ్ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మిల్లు యాజమాన్యాన్ని డీసీపీ ఆదేశించారు. రవాణా ప్రక్రియలో జాప్యం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, రైతులకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో లక్షెట్టిపేట తహసిల్దార్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, సీఐ రమణమూర్తి, ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చైన్‌మన్ చీకటి చాప్టర్.. అక్రమాలకు ఫుల్ సపోర్టర్..!

- రాంపల్లి – చెర్లపల్లి మెయిన్ రోడ్డుపై అక్రమ నిర్మాణాల ఆరోపణలు..
- అనుమతులు లేకుండానే భారీ భవన నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికుల ఫిర్యాదు..
- టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు..
- చైన్‌మన్ బి. శ్రీనివాస్ రావుపై లంచాలు, అక్రమ నిర్మాణాలకు సహకారం ఆరోపణలు..
- అక్రమ నిర్మాణాలకు గైడర్‌గా వ్యవహరిస్తున్నాడని ప్రజల ఆరోపణ..
- చైన్ మన్ బి. శ్రీనివాస్ రావుపై విచారణ చేపట్టాలని డిమాండ్..
- అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల ఆవేదన..



**నాగారం, రాజముద్ర న్యూస్:** రాంపల్లి – చెర్లపల్లి ప్రధాన రహదారిపై అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకు తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ఉప్పల్ జోన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ఘట్‌కేసర్ సర్కిల్-6లోని నాగారం డివిజన్ రాంపల్లిలో ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండానే భారీ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని బహిరంగంగానే నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ, టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పలుమార్లు ఫిర్యాదులు చేసినా "నోటీసులు ఇచ్చాం", "చర్యలు తీసుకుంటాం" అంటూ కాలయాపన తప్ప అసలు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొంతమంది అధికారుల హస్తం ఉందనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా చైన్‌మన్ బి. శ్రీనివాస్ రావు వ్యవహారంపై ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో మరో సర్కిల్‌లో పనిచేసిన సమయంలో అక్రమ నిర్మాణ యజమానుల నుంచి లంచాలు తీసుకుని సహకరించాడనే ఆరోపణలతో ఆయనను బదిలీ చేయడం లేదా సస్పెండ్ చేయడం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. అయితే తిరిగి ఘట్‌కేసర్ సర్కిల్-6లో చేరిన తర్వాత ఆయన వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు రాలేదని ఆరోపిస్తున్నారు. స్థానికుల మాటల్లో, "అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారే ఇప్పుడు వాటికి మార్గదర్శకుడిగా మారిపోయాడు" అనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణ యజమానులకు ఎలా అనుమతులు తప్పించుకోవాలి, ఎలా పనులు కొనసాగించాలి అనే విషయాల్లో చైన్‌మన్ మార్గనిర్దేశం చేస్తున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో సర్కిల్ పరిధిలో అనధికార నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోయాయని అంటున్నారు. ప్రధాన రహదారిపై భారీ నిర్మాణాలు కొనసాగుతుండటంతో భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చట్టాలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం వెనుక అవినీతి ఉందని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పట్టించుకోకుండా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో చైన్‌మన్ బి. శ్రీనివాస్ రావుపై సమగ్ర విచారణ చేపట్టి, ఆయన ఆస్తులు, విధుల నిర్వహణపై దర్యాప్తు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రాంపల్లి – చెర్లపల్లి ప్రధాన రహదారిపై కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్
- మిల్లులు, గోదాములకు తరలింపు త్వరగా పూర్తి కావాలి



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** కొనుగోలు కేంద్రాల నుండి సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు త్వరితగతిన తరలించి, దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన హాజీపూర్ మండలంలోని రాజరాజేశ్వర రైస్ మిల్ ను సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం గాయత్రి రైస్ మిల్ లో ఏర్పాటు చేసిన గోదామును ప్రారంభించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం దెబ్బతినకుండా గోదాముల్లో భద్రపరచాలని, లారీలు, హమాలీల కొరత లేకుండా అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం జైపూర్ మండలం ఇందారంలోని సుముఖ గోదాము, జయలక్ష్మి రైస్ మిల్ తో పాటు లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేటలోని కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రోజుకు కనీసం 10 నుండి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచాలని మిల్లర్లకు సూచించారు. రవాణాలో అంతరాయం కలగకుండా తగినన్ని లారీలను సమకూర్చుకోవాలని, ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలు అనుసంధానంగా సాగాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో తహసిల్దార్లు పుష్పలత, దిలీప్ కుమార్, రోహిత్ దేశ్ పాండే, ఎంపీడీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చర్చనీయాంశంగా రాజముద్ర కథనం

- అనుమతి లేని ఫారిన్ టూర్ పై ఉలిక్కిపాటు
- మేకపోతు గాంభీర్యంలో బిజినెస్ టీచర్
- సస్పెన్షన్ కాకుండా చూస్తే లక్ష రూపాయల నజరానా..?
- రాజకీయ నాయకులకు బంపర్ ఆఫర్
- విద్యాశాఖ అధికారులు స్పందించేనా..!




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** డిప్యూటీ సీఎం ఇలాకాలో బిజినెస్ టీచర్ అనే శీర్షికన రాజముద్ర దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉపాధ్యాయ,రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ అనుమతులు లేకుండా విలాసాల కోసం పలుమార్లు విదేశాలకు(థాయిలాండ్) వెళ్లిన ఉపాధ్యాయుడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.బోనకల్ మండలంలోని రామాపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఈ వ్యాపార ఉపాధ్యాయుడు రియల్ ఎస్టేట్ వ్యాపారావకాశంలో భాగంగా అడ్డదారిలో విదేశాలకి వెళ్లిన బాగోతాన్ని రాజముద్ర వెలుగులోకి తీసుకువచ్చింది.దీంతో తనకేం కాదని,ఓ రాజకీయ పార్టీ నాయకుల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని ఉపాధ్యాయుడు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడు.అదే విధంగా ఉన్నతాధికారుల నుండి సస్పెన్షన్ వేటు పడకుండా తప్పించుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులను ఆశ్రయించి,సస్పెన్షన్ కాకుండా చూస్తే లక్ష రూపాయలను నజరానాగా ఇస్తానని బంపర్ ఆఫర్ చేసినట్లుగా ఉపాధ్యాయుల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

**పేద విద్యార్థులకి అందని ప్రభుత్వ విద్య**

2018 లో రామాపురం ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరిన ఈ ఉపాధ్యాయుడు ఆగడాలకు అంతే లేదు.గత కొన్ని సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్ ను గాలికి వదిలేశాడు.పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని అభాసుపాలు చేసి అక్రమ సంపాదనకు అలవాటు పడ్డాడు.ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎలాంటి ప్రైవేటు వ్యాపారాలు చేయవద్దనే ప్రభుత్వ నిబంధనలను భేఖాతరు చేస్తూ ఉద్యోగ ధర్మాన్ని వదిలి వ్యాపారమే ధర్మంగా వ్యవహరించాడు.అంతే కాకుండా కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టినట్లుగా సిన్సియర్ గా విధులు నిర్వహిస్తున్న ఇతర పాఠశాలల్లోని కొందరు ఉపాధ్యాయులకు రెట్టింపు ఆదాయం వస్తుందనే ఆశ చూపి వారిని కూడా రియల్ ఎస్టేట్, ఫైనాన్స్,ఇన్సూరెన్స్ వ్యాపారాల్లోకి లాగి ప్రభుత్వ పాఠశాలల ఉనికి దెబ్బతీసేలా వ్యవహరించడం శోచనీయం.

**సాంకేతికంగా అడ్డంగా దొరికిన ఉపాధ్యాయుడు**

రాష్ట్ర విద్యాశాఖ (డిఎస్ఈ) అనుమతులు లేకుండానే విదేశాలకు(ఫారిన్ టూర్) వెళ్లిన ఉపాధ్యాయుడు తప్పుల మీద తప్పులు చేసి సాంకేతికంగా అడ్డంగా దొరికిపోయాడు.విదేశాలకు వెళ్లేందుకు వ్యక్తిగత కారణాలను చూపుతూ తప్పని సరిగా హాఫ్ పే లీవు పెట్టాలి.కానీ అలాంటివేమీ లేకుండానే పేరుకు మాత్రం రెండు,మూడు రోజులు సాధారణ సెలవులు పెట్టి,వారాలు కొద్ది బడి ఎగ్గొట్టి విదేశాల్లో(థాయిలాండ్)విహరించడం మరో తప్పు.ఇదిలా ఉండగా అక్రమంగా విదేశాలకి వెళ్లిన సమయంలో వినియోగించుకున్న సెలవులు బండారం బయటపడుతుందనే ఉద్దేశ్యంతో ఉపాధ్యాయుల హాజరు పట్టికలను వ్యాపార ఉపాధ్యాయుడు ధ్వంసం చేసినట్లుగా విశ్వసనీయ వర్గాల సమాచారం.జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఉపాధ్యాయుడు అనుమతి లేని విదేశీయానం పై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## కోహ్లీ క్యాచ్ మిస్ చేయడమే మ్యాచ్ మలుపు: అజింక్య రహానే

**రాయ్‌పూర్, మే 14 :** ఐపీఎల్ 2026లో భాగంగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన కీలక పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయం సాధించింది. ఈ ఓటమితో కోల్‌కతా నైట్ రైడర్స్ ప్లేఆఫ్స్ ఆశలకు భారీ దెబ్బ తగిలింది. మ్యాచ్ అనంతరం కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే తమ జట్టు ఓటమికి ప్రధాన కారణం ఫీల్డింగ్ వైఫల్యమేనని అంగీకరించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. యువ బ్యాటర్ అంగ్క్రిష్ రఘువంశీ 46 బంతుల్లో 71 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, మూడు భారీ సిక్సర్లు ఉన్నాయి. చివర్లో రింకూ సింగ్ వేగంగా ఆడుతూ 29 బంతుల్లో అజేయంగా 49 పరుగులు చేసి స్కోరును మరింత పెంచాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, రసిఖ్ సలాం దార్ తలా ఒక వికెట్ తీశారు. 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టుకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత ఇన్నింగ్స్‌తో విజయాన్ని అందించాడు. కోహ్లీ కేవలం 60 బంతుల్లోనే 105 పరుగులతో అజేయ శతకం సాధించి మ్యాచ్‌ను ఒంటిచేత్తో ముగించాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. అతనికి ఇతర బ్యాటర్లు కూడా సహకరించడంతో బెంగళూరు జట్టు 19.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేధించింది. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్ కార్యక్రమంలో మాట్లాడిన అజింక్య రహానే కీలక వ్యాఖ్యలు చేశారు. “మా ఓటమికి ప్రధాన కారణం బ్యాటింగ్ కాదు.. ఫీల్డింగ్‌లో చేసిన పొరపాట్లే. విరాట్ కోహ్లీ క్యాచ్‌ను కీలక సమయంలో వదిలేయడం మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది” అని తెలిపారు. “కోహ్లీ లాంటి ఆటగాడికి అవకాశం ఇస్తే అతను మ్యాచ్‌ను పూర్తిగా మార్చేస్తాడు. కొత్తగా క్రీజులోకి వచ్చే బ్యాటర్‌కు ఈ పిచ్‌పై ఆడటం అంత సులభం కాదు. ఆ సమయంలో కోహ్లీని ఔట్ చేసి ఉంటే మ్యాచ్ పరిస్థితి వేరేలా ఉండేది” అని రహానే విశ్లేషించారు. గత కొన్ని మ్యాచ్‌లలో తమ జట్టు ఫీల్డింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిందని, కానీ ఇంత కీలకమైన మ్యాచ్‌లో సులభ క్యాచ్‌లు చేజార్చడం బాధాకరమని అన్నారు. ప్లేఆఫ్స్ రేసులో ఇలాంటి చిన్న తప్పిదాలే పెద్ద మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి తీసుకొస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కోహ్లీ శతకంపై అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కీలక మ్యాచ్‌లో ఒత్తిడిని జయిస్తూ జట్టుకు విజయం అందించాడని కొనియాడుతున్నారు. ఈ విజయంతో బెంగళూరు జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత బలపరుచుకోగా, కోల్‌కతా జట్టుకు మిగిలిన మ్యాచ్‌లు ‘చావో రేవో’గా మారాయి.

## ముంబై ఇండియన్స్‌లో కలకలం

### బుమ్రా కెప్టెన్‌గా కొత్త రికార్డా?

ముంబై, మే 14 : ఈసారి ఐపీఎల్‌లో పూర్తిగా నిరాశపరిచిన ముంబై ఇండియన్స్ జట్టులో ఇప్పుడు కెప్టెన్సీ మార్పులు హాట్ టాపిక్‌గా మారాయి. ప్లేఆఫ్స్ రేసు నుంచి ఇప్పటికే తప్పుకున్న ముంబై.. మిగిలిన మ్యాచ్‌ల్లో పరువు కాపాడుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్‌తో ధర్మశాలలో జరగనున్న మ్యాచ్‌కు రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అందుబాటులో లేకపోవడం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. తాత్కాలిక సారథిగా వ్యవహరిస్తున్న సూర్యకుమార్ యాదవ్ కూడా జట్టుతో కనిపించకపోవడంతో ఇప్పుడు జట్టు పగ్గాలు జస్ప్రీత్ బుమ్రాకు అప్పగించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అలా జరిగితే ఒకే సీజన్‌లో ముగ్గురు వేర్వేరు కెప్టెన్లతో ఆడిన జట్టుగా ముంబై ఇండియన్స్ అరుదైన రికార్డు సృష్టించనుంది. ఇప్పటికే హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ జట్టును నడిపించగా.. ఇప్పుడు బుమ్రా మూడో కెప్టెన్‌గా మారే అవకాశముంది. సీనియర్ ఆటగాడిగా జట్టులో ఎంతో అనుభవం ఉన్న బుమ్రాపై యాజమాన్యం, కోచ్‌లు నమ్మకం ఉంచినట్లు సమాచారం. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు ఏదీ కలిసి రాలేదు. స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ జట్టు వరుస పరాజయాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ముఖ్యంగా కెప్టెన్ హార్దిక్ పాండ్యా వ్యూహాలు, అతడి వ్యక్తిగత ఫామ్ అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాయి. ఎనిమిది మ్యాచ్‌ల్లో కేవలం 146 పరుగులు మాత్రమే చేసిన పాండ్యా.. బౌలింగ్‌లో కూడా నాలుగు వికెట్లతోనే సరిపెట్టుకున్నాడు. దీంతో వచ్చే సీజన్‌కు అతడిని జట్టు కొనసాగిస్తుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు బుమ్రాకు పూర్తి స్థాయి కెప్టెన్సీ ఇస్తే జట్టులో కొత్త ఉత్సాహం రావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పదమూడు ఏళ్లుగా ముంబై జట్టుకు సేవలందిస్తున్న బుమ్రాకు డ్రెస్సింగ్ రూమ్‌లో మంచి గౌరవం ఉందని, జట్టును సమర్థంగా నడిపించే సామర్థ్యం కూడా ఉందని చెబుతున్నారు. రోహిత్ శర్మ వంటి సీనియర్ ఆటగాడు జట్టులో ఉన్నప్పటికీ భవిష్యత్ దృష్ట్యా బుమ్రాకే అవకాశం ఇవ్వొచ్చనే చర్చ సాగుతోంది. మొత్తంగా చూస్తే ముంబై ఇండియన్స్‌కు ఈ సీజన్ పూర్తిగా చేదు అనుభవంగా మారింది. ఇప్పుడు మిగిలిన మ్యాచ్‌ల్లో జట్టు ఎలా రాణిస్తుంది? బుమ్రా నిజంగానే కెప్టెన్ అవుతాడా? హార్దిక్ పాండ్యా భవిష్యత్‌పై యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.



# తిలక్ వర్మ మెరుపులు!

ఆఖరి ఓవర్లో ఉత్కంఠ గెలుపు..

ముంబై ఇండియన్స్ అద్భుత ఛేదన

పంజాబ్ కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం..

వృథా అయిన ప్రభ్ సిమ్రన్ పోరాటం



**ధర్మశాల :** ఐ పీ ఎల్ లో భాగంగా హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ పీ సీ ఏ) స్టేడియం వేదికగా గురువారం జరిగిన మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ (పీ బీ కే ఎస్) పై ముంబై ఇండియన్స్ (ఎం ఐ) అద్భుత విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ రసవత్తర పోరులో ఆఖరి బంతి వరకు ఉత్కంఠ రేగగా.. ముంబై 6 వికెట్ల తేడాతో పంజాబ్ ను చిత్తు చేసింది. యువ కెప్టెన్ తిలక్ వర్మ విధ్వంసక అర్ధశతకంతో చెలరేగి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై ఇండియన్స్ 19.5 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 205 పరుగులు చేసి గెలుపు సంబరాలు చేసుకుంది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ అజేయ హాఫ్ సెంచరీతో కదంతొక్కగా.. ర్యాన్ రికెల్టన్, విల్ జాక్స్ రాణించారు. బౌలింగ్ లో శార్దూల్ ఠాకూర్ 4 వికెట్లతో పంజాబ్ పతనాన్ని శాసించాడు.

### ప్రభ్ సిమ్రన్, అజ్మతుల్లా దూకుడు..

టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. మంచు ప్రభావం (డ్యూ ఫ్యాక్టర్) ఉంటుందనే అంచనాలతో చేజింగ్ కు మొగ్గుచూపాడు. అయితే మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కింగ్స్ కు ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ సింగ్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ముంబై బౌలర్లను లక్ష్యంగా చేసుకుని మైదానం నలువైపులా భారీ సిక్సర్లు బాదాడు. కేవలం 32 బంతుల్లోనే 57 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా ఆల్ రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ సైతం బ్యాట్ ఝుళిపించాడు. 17 బంతుల్లోనే 38 పరుగులు సాధించి స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో ప్రియాంశ్ ఆర్య 17 బంతుల్లో 22 పరుగులు చేయడంతో పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 39 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి పంజాబ్ భారీ స్కోరుకు కళ్లెం వేశాడు. దీపక్ చాహర్ 36 పరుగులిచ్చి 2 వికెట్లు, రాజ్ బావా 11 పరుగులిచ్చి 1 వికెట్ తీశారు.

### కెప్టెన్ ఇన్నింగ్స్ తో ముంబై జయభేరి..

201 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ కు ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ మెరుగైన ఆరంభాన్నిచ్చాడు. 23 బంతుల్లోనే 48 పరుగులు సాధించి జట్టును రేసులో నిలిపాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ బౌండరీల వర్షం కురిపించాడు. బాధ్యతాయుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మ కేవలం 33 బంతుల్లోనే అజేయంగా 75 పరుగులు బాది మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అతనికి తోడుగా విల్ జాక్స్ కేవలం 10 బంతుల్లోనే అజేయంగా 25 పరుగులు సాధించి ఫినిషర్ పాత్ర పోషించాడు. దీంతో ముంబై మరో బంతి మిగిలి ఉండగానే (19.5 ఓవర్లలో) 205 పరుగులు చేసి జయభేరి మోగించింది. పంజాబ్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 36 పరుగులిచ్చి 2 వికెట్లు, యుజ్వేంద్ర చాహల్ 32 పరుగులిచ్చి 1 వికెట్, మార్కో జాన్సెన్ 55 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టినా లాభం లేకపోయింది.

### పట్టికలో పంజాబ్, ముంబైల పరిస్థితి..

ఈ అద్భుత విజయంతో ముంబై ఇండియన్స్ పాయింట్ల ఖాతాను మెరుగుపరుచుకుంది. అయితే టోర్నీలో ఆరంభం నుంచే తడబడిన ముంబై (మొత్తం 12 మ్యాచ్ ల్లో 4 విజయాలు, 8 పరాజయాలతో 8 పాయింట్లు) ప్లే ఆఫ్స్ రేసులో వెనుకబడి పట్టికలో కిందిస్థాయిలోనే కొనసాగుతోంది. మరోవైపు ఈ మ్యాచ్ లో పోరాడి ఓడిన పంజాబ్ కింగ్స్ (మొత్తం 12 మ్యాచ్ ల్లో 6 విజయాలు, 6 పరాజయాలతో 12 పాయింట్లు) పట్టికలో నాలుగో స్థానంలో ఉంటూ ప్లే ఆఫ్స్ అవకాశాలను క్లిష్టమయం చేసుకుంది. తర్వాత జరిగే మ్యాచ్ ల్లో భారీ విజయాలు సాధిస్తే తప్ప పంజాబ్ ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. లీగ్ దశ ఆఖరి ఘట్టానికి చేరుకోవడంతో ప్రతి మ్యాచ్ టోర్నీ భవితవ్యాన్ని శాసిస్తోంది

# ఐపీఎల్‌లో కెప్టెన్లపై వేటు?

## అక్షర్, పంత్, రహానే భవితవ్యంపై సందేహాలు

**ముంబై, మే 14:** ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ పలు ఫ్రాంచైజీల్లో భారీ మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా వరుస వైఫల్యాలతో ప్లేఆఫ్స్‌కు జట్లను చేర్చడంలో విఫలమైన ముగ్గురు కెప్టెన్ల భవితవ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్షర్ పటేల్, రిషభ్ పంత్, అజింక్యా రహానే తదుపరి సీజన్‌లో కెప్టెన్లుగా కొనసాగుతారా లేదా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. లక్నో సూపర్ జెయింట్స్ ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించగా, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ కూడా దాదాపుగా అవకాశాలు కోల్పోయాయి. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యాలు సీరియస్‌గా సమీక్షలు ప్రారంభించినట్లు సమాచారం. ఢిల్లీ జట్టుకు నాయకత్వం వహించిన అక్షర్ పటేల్ ఈ సీజన్‌లో బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. తొమ్మిది ఇన్నింగ్స్‌లలో కేవలం 100 పరుగులు మాత్రమే చేసి తీవ్ర నిరాశ పరిచాడు. అందులో ఒకే ఇన్నింగ్స్‌లో చేసిన 56 పరుగులు మినహా మిగిలిన మ్యాచ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. బౌలింగ్‌లో 12 మ్యాచ్‌లలో 10 వికెట్లు తీసినా, కీలక సమయాల్లో తాను స్వయంగా బౌలింగ్‌కు రావడంలో వెనుకంజ వేసిన తీరు విమర్శలకు దారితీసింది. కెప్టెన్‌గా వ్యూహాత్మక నిర్ణయాల్లో కూడా అక్షర్ బలహీనంగా కనిపించాడని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకంగా యువ ఆటగాళ్ల వినియోగంలో చేసిన తప్పిదాలు ఢిల్లీ జట్టుకు భారీ నష్టంగా మారాయి. ప్రతిభావంతుడైన అభిషేక్ పోరెల్కు సరైన అవకాశాలు ఇవ్వకపోవడం, ఆల్‌రౌండర్ మాధవ్ తివారీను సరిగా ఉపయోగించుకోకపోవడం యాజమాన్యాన్ని అసంతృప్తికి గురి చేసినట్లు తెలుస్తోంది. ఇక రిషభ్ పంత్ పరిస్థితి కూడా అంతే క్లిష్టంగా మారింది. భారీ మొత్తానికి లక్నో జట్టులో చేరిన పంత్ నుంచి అభిమానులు, యాజమాన్యం పెద్ద అంచనాలు పెట్టుకున్నాయి. కానీ ఈ సీజన్‌లో అతని ప్రదర్శన తీవ్ర నిరాశ కలిగించింది. 11మ్యాచ్‌లలో కేవలం 251 పరుగులు మాత్రమే చేసిన పంత్, తన సహజమైన దూకుడు ఆటను పూర్తిగా కోల్పోయినట్లు కనిపించాడు. కేవలం తొమ్మిది సిక్సర్లు మాత్రమే కొట్టడం అతని ఫామ్ ఎంత దారుణంగా ఉందో స్పష్టం చేస్తోంది. కెప్టెన్సీ ఒత్తిడి అతని ఆటపై స్పష్టంగా ప్రభావం చూపిందని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జట్టు ఎంపికలోనూ పలు తప్పిదాలు చోటుచేసుకున్నాయి. యువ ఆటగాడు అర్షిన్ కులకర్ణిను ఓపెనర్‌గా పంపడం, దేశవాళీ క్రికెట్‌లో సాధారణ రికార్డులు మాత్రమే ఉన్న హిమ్మత్ సింగ్కు వరుస అవకాశాలు ఇవ్వడం వంటి నిర్ణయాలు విమర్శలకు గురయ్యాయి. అలాగే ఆయుష్ బదోనిను టాప్ ఆర్డర్‌లో ప్రయోగించడం కూడా ఫలితం ఇవ్వలేదు. జట్టులో నికోలస్ పూరన్, ఏడెన్ మార్క్రమ్ వంటి స్టార్ ఆటగాళ్లు ఫామ్ కోల్పోవడం కూడా లక్నో వైఫల్యానికి కారణమైంది. మరోవైపు కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానేపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంప్రదాయ టెస్ట్ బ్యాటింగ్ శైలితో పేరొందిన రహానే టీ20 ఫార్మాట్‌కు అవసరమైన వేగాన్ని అందుకోలేకపోతున్నాడని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో 237 పరుగులు చేసిన రహానే స్ట్రైక్ రేట్ కేవలం 133 మాత్రమే. టాప్ ఆర్డర్‌లో అతని నిదానమైన ఆట కారణంగా జట్టు పలుమార్లు ఒత్తిడిలో పడింది. యువ ఆటగాడు అంగ్క్రిష్ రఘువంశీ కూడా వేగంగా పరుగులు చేయడంలో విఫలమవడంతో కేకేఆర్ బ్యాటింగ్ దెబ్బతింది. 11 మ్యాచ్‌లలో ఈ ఇద్దరూ కలిసి కేవలం 25 సిక్సర్లు మాత్రమే కొట్టడం జట్టు దూకుడు ఎంత తక్కువగా ఉందో చూపిస్తోంది. టీ20ల్లో వేగవంతమైన బ్యాటింగ్ అత్యవసరమైన సమయంలో రహానే పాత శైలిలోనే కొనసాగడం అభిమానులను నిరాశపరుస్తోంది. ఇటీవల తన స్ట్రైక్ రేట్‌పై వచ్చిన విమర్శలకు స్పందిస్తూ “అసూయతో మాట్లాడుతున్నారు” అని రహానే చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. అయితే ప్రస్తుతం ఆయన ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. క్రికెట్ వర్గాల అంచనాల ప్రకారం అక్షర్, పంత్‌లకు ఆటగాళ్లుగా ఇంకా మంచి డిమాండ్ ఉన్నప్పటికీ కెప్టెన్లుగా కొనసాగడం కష్టమేనని భావిస్తున్నారు. మరోవైపు రహానే భవిష్యత్తు మరింత అనిశ్చితంగా కనిపిస్తోంది. వచ్చే మినీ వేలంలో ఆయనపై ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతాయా లేదా అన్నది కూడా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.





# కామెడీ షోల వల్గారిటీపై బిందు మాధవి వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 14 :** తెలుగు టెలివిజన్‌లో కామెడీ కార్యక్రమాలకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా ప్రసారమవుతున్న కామెడీ షోలు ప్రేక్షకులను అలరిస్తూనే అనేక మంది కమెడియన్స్, యాంకర్లు, నటులకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. అయితే ఈ షోలపై డబుల్ మీనింగ్ డైలాగ్స్, వల్గారిటీ జోక్స్, కుటుంబంతో కలిసి చూడలేని కొన్ని స్కిట్స్ ఉన్నాయనే విమర్శలు కూడా తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు ఇదే అంశంపై హీరోయిన్, బిగ్‌బాస్ ఫేమ్ బిందు మాధవి చేసిన వ్యాఖ్యలు తెలుగు టెలివిజన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.ప్రస్తుతం బిందు మాధవి కొత్తగా ప్రారంభమైన 'మాస్ జాతర' కామెడీ షోలో జడ్జిగా వ్యవహరిస్తోంది. ఈ షో కూడా స్కిట్స్, వినోదాత్మక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరిస్తోంది. అయితే ఇతర కామెడీ షోల మాదిరిగా కాకుండా కుటుంబమంతా కలిసి చూసేలా క్లీన్ కామెడీ అందించడమే తమ లక్ష్యమని షో నిర్వాహకులు చెబుతున్నారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో పాల్గొన్న బిందు మాధవి కామెడీ షోలలో పెరుగుతున్న వల్గారిటీపై స్పందించింది. "మాస్ జాతర పూర్తిగా వినోదంతో నిండిన కార్యక్రమం. మొదట నన్ను జడ్జిగా చేయమని అడిగినప్పుడు వెంటనే అంగీకరించలేదు. ఎందుకంటే ఈ మధ్య చాలా కామెడీ షోలలో డబుల్ మీనింగ్ డైలాగ్స్, వల్గర్ కామెడీ ఎక్కువైపోయిందనే భావన కలిగింది. అలాంటి కార్యక్రమాలను చూసి కొంత అసహనం కూడా కలిగేది" అని చెప్పింది. తర్వాత షో దర్శకుడు ప్రత్యేకంగా వచ్చి ఈ కార్యక్రమం గురించి వివరించారని బిందు మాధవి తెలిపింది. "మా షోలో ఎలాంటి వల్గారిటీ ఉండదు. ఎక్కడైనా అసభ్యకరమైన డైలాగ్స్ ఉంటే మీరు మధ్యలోనే షో నుంచి వెళ్లిపోవచ్చు అని నాతో చెప్పారు. కుటుంబమంతా కలిసి కూర్చొని చూసేలా కార్యక్రమాన్ని రూపొందిస్తామని హామీ ఇచ్చారు. అందుకే నేను ఈ షో చేయడానికి అంగీకరించాను" అని వివరించింది. ఇప్పటికే 28 ఎపిసోడ్లు పూర్తయ్యాయని, ఇప్పటివరకు ఒక్కసారి కూడా అసౌకర్యంగా అనిపించలేదని ఆమె చెప్పింది. "తెలుగులో కూడా వల్గారిటీ లేకుండా మంచి కామెడీ చేయవచ్చని మా షో నిరూపిస్తోంది. కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని వినోదాన్ని అందించడం చాలా ముఖ్యం. ఈ కార్యక్రమంలో భాగమవ్వడం నాకు గర్వంగా ఉంది" అంటూ బిందు మాధవి వ్యాఖ్యానించింది. ఆమె వ్యాఖ్యలు బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. బిందు మాధవి నేరుగా ఏ షో పేరు ప్రస్తావించకపోయినా, చాలా మంది నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలను ప్రముఖ కామెడీ షోలపై పరోక్ష విమర్శలుగా భావిస్తున్నారు. ముఖ్యంగా డబుల్ మీనింగ్ కామెడీపై గతంలో వచ్చిన విమర్శలను మరోసారి నెటిజన్లు ప్రస్తావిస్తున్నారు. తెలుగు టెలివిజన్‌లో కామెడీ షోల పరిణామంపై కూడా ఈ వ్యాఖ్యలతో చర్చ మొదలైంది. ఒకప్పుడు కుటుంబమంతా కలిసి చూసే వినోద కార్యక్రమాలుగా గుర్తింపు పొందిన షోలు, క్రమంగా ట్రెండ్ పేరుతో వల్గారిటీ వైపు వెళ్లాయని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ప్రేక్షకుల అభిరుచులు మారుతున్నాయని, అందుకే షోలు కూడా మారాల్సి వస్తోందని మరికొందరు అంటున్నారు. ఇటీవల కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించే కార్యక్రమాలకు మళ్లీ ఆదరణ పెరుగుతోందని టెలివిజన్ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల పోటీ పెరిగిన నేపథ్యంలో టీవీ షోలు కుటుంబ ప్రేక్షకులను నిలబెట్టుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి బిందు మాధవి చేసిన వ్యాఖ్యలు తెలుగు కామెడీ షోలలో వల్గారిటీ అంశాన్ని మరోసారి చర్చకు తెచ్చాయి. భవిష్యత్తులో వినోద కార్యక్రమాలు ఎటువైపు సాగుతాయో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మైసా కోసం రష్మిక ప్రత్యేక ట్రైనింగ్



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా కేరళలో జరిగిన షెడ్యూల్‌లో కీలకమైన స్టంట్స్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. షెడ్యూల్ పూర్తైన సందర్భంగా యూనిట్ సభ్యులతో కలిసి తీసుకున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన రష్మిక.. 'ఇంత కష్టపడి పనిచేసిన నా టీమ్‌కు థ్యాంక్యూ.. త్వరలో మళ్లీ సెట్స్‌లో కలుద్దాం' అంటూ ఎమోషనల్‌గా స్పందించారు.

# శోభిత సరదా కామెంట్ వైరల్



**హైదరాబాద్, మే 14:** అక్కినేని హీరో నాగచైతన్య, నటి శోభిత ధూళిపాళ జంట ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పెళ్లి తర్వాత ఈ జంట ఎక్కడ కనిపించినా అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంటోంది. తాజాగా విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న ఈ జంట ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో జరిగిన చిన్న సరదా సంభాషణ కారణంగా మరోసారి వార్తల్లో నిలిచింది. నిన్న అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న నాగచైతన్య, శోభితలను చూసేందుకు అభిమానులతో పాటు మీడియా ప్రతినిధులు కూడా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సెలబ్రిటీలు ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్నారనే సమాచారం అందిన వెంటనే ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు అక్కడికి చేరుకోవడం సాధారణమే. ఈ క్రమంలో చై–శోభిత జంట బయటకు వస్తుండగా కెమెరాలు వరుసగా క్లిక్‌మనిపించాయి. నాగచైతన్యతో కలిసి ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తున్న శోభిత ధూళిపాళ, అర్ధరాత్రి అయినా మీడియా అక్కడే ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే చిరునవ్వుతో మీడియా ప్రతినిధుల వైపు చూస్తూ.. "మీరు అస్సలు నిద్రపోరా?" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె చెప్పిన తీరు అక్కడున్న వారిని ఒక్కసారిగా నవ్వుల్లో ముంచెత్తింది. శోభిత వ్యాఖ్య విన్న నాగచైతన్య కూడా చిరునవ్వు చిందించడం వీడియోలో స్పష్టంగా కనిపించింది. అనంతరం అభిమానులకు చేతులు ఊపుతూ ఈ జంట అక్కడి నుంచి కారులో వెళ్లిపోయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. "శోభిత చాలా సహజంగా మాట్లాడింది", "మీడియా కష్టాన్ని సరదాగా గుర్తుచేసింది", "చై–శోభిత జంట చాలా క్యూట్‌గా ఉంది" అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కొందరు అభిమానులు ఈ జంట సింప్లిసిటీని ప్రశంసిస్తుండగా, మరికొందరు వీరిద్దరి అన్యోన్యత ఆకట్టుకుంటోందని అభిప్రాయపడుతున్నారు. తెనాలికి చెందిన శోభిత ధూళిపాళ మోడలింగ్ రంగం ద్వారా తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బాలీవుడ్, తెలుగు, తమిళం, మలయాళం వంటి పలు భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. తన అందం, నటన, ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో తక్కువ సమయంలోనే సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఇటీవల అక్కినేని కుటుంబంతో ఆమెకు ఏర్పడిన అనుబంధం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో ఆమెకు మరింత క్రేజ్ పెరిగింది. ఇక నాగచైతన్య కూడా వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు. వ్యక్తిగత జీవితంలో కొత్త దశలోకి అడుగుపెట్టిన తర్వాత ఆయన మరింత ప్రశాంతంగా కనిపిస్తున్నారని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. తరచూ కలిసి కనిపిస్తున్న నాగచైతన్య–శోభిత జంట సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్న ఈ జంటపై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది.




# పెద్ది క్రేజ్ పెంచేలా ప్రమోషన్స్

## ముంబైలో ఒకటి..భోపాల్‌లో మరో ఈవెంట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తున్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయి–ంలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ఎ÷–లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ఎ÷–లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ లుక్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు పాన్ ఇండియా స్థాయిలో రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' ఇప్పటికే రికార్డుల వేట మొదలుపెట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల ప్రీ–సేల్స్‌కు భారీ స్పందన లభిస్తోందని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయనుండగా.. జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com